



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ




దేశ ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ తో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
-న్యూఢిల్లీ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :


| విజయవాడ | సంపుటి : 24 | సంచిక : 257 | ది. 20-12-2025 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 24 | Issue No : 257 | Date : 20-12-2025 | Friday | Pages : 8 | Rs.1/- |


## తెలుగు ఐక్యతను ప్రపంచవ్యాప్తంగా చాటేందుకు సహకరిస్తా

● సీఎంను కలిసిన ఆటా ప్రతినిధులు ●19వ మహాసభలకు సీఎంను ఆహ్వానించిన ఆటా ప్రతినిధులు



**హైదరాబాద్,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని అమెరికా తెలుగు అసోసియేషన్(ఆటా) ప్రెసిడెంట్ జయంత్ చల్లా, ఎలెక్ట్ ప్రెసిడెంట్ సతీష్ రామసహాయం రెడ్డి, ఇతర ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వచ్చే ఏడాది జూలై 31న జరగనున్న 19వ ఆటా మహాసభలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా సీఎం తో అమెరికాలో ఉన్న తెలుగు ప్రవాసుల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న ఆటా మహాసభలకు రావాలని కోరారు. అలాగే 19వ మహాసభల లక్ష్యాలు, కార్యక్రమాల రూపురేఖలను ముఖ్యమంత్రికి వివరించారు. యువత భాగస్వామ్యం, వ్యాపార అవకాశాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆటా ప్రతినిధులతో మాట్లాడుతూ, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో ఆటా కీలక పాత్ర పోషిస్తోందని ముఖ్యమంత్రి ప్రశంసించారు. ప్రవాస భారతీయులు, ముఖ్యంగా తెలుగు వాసులు రాష్ట్ర అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. విద్య, ఐటీ, పెట్టుబడులు, సాంస్కృతిక మార్పిడిలో ఆటా వేదికగా నిలుస్తోందని అన్నారు. అలాగే ఈ మహాసభలు తెలుగు ఐక్యతను ప్రపంచస్థాయిలో చాటేలా నిర్వహించేందుకు తమ సహకారం ఉంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో బోర్డ్ ఆఫ్ ట్రస్టీ, కో-చైర్ నరసింహ ద్యాసాని, సాయి సుధిని, ట్రెజరర్ శ్రీకాంత్ గుడిపాటి, ఇతర ప్రతినిధులు శ్రీధర్ బాణాల, కాశీ కొత్త, రామకృష్ణ అలా, సుధీర్ దామిడి, శ్రీధర్ తిరిపతి, పరమేష్ భీంరెడ్డి, రాజు కక్కెర్ల, రఘువీర్ మర్రిపెద్ది, వినోద్ కోడూరు, కిషోర్ గూడూరు, నర్సిరెడ్డి గడ్డికోపుల, విష్ణు మాధవరం, హరీష్ బత్తిని, సుమ ముప్పాల, వేణు నక్షత్రం, లక్ష్ చేపూరి, అనంత్ పజ్జూర్, అరవింద్ ముప్పిడి, తిరుమల్ మునుకుంట్ల, మీడియా సలహాదారు ఈశ్వర్ బండా తదితరులు వున్నారు.

## ప్రభాకర్ రావు కస్టడీ పొడిగింపు.. సుప్రీం ఆదేశం

**న్యూఢిల్లీ, డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు పొడిగించింది సుప్రీం కోర్టు. డిసెంబర్ 25 వరకు కస్టోడియల్ విచారణ చేసేందుకు సుప్రీంకోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. నిన్నటి (గురువారం) ప్రభాకర్ రావు వారం రోజుల కస్టోడియల్ విచారణ పూర్తి అయిన విషయం తెలిసిందే. అయితే ట్యాపింగ్ కేసులో మరికొన్ని రోజులు విచారణ చేయాలని సుప్రీంకోర్టును సిట్ కోరింది. వారం రోజుల కస్టోడియల్ విచారణ రిపోర్ట్‌ను ఉన్నత న్యాయస్థానానికి సిట్ అందజేసింది.దీంతో ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణను వారం రోజుల పాటు పొడిగింపుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 26న పోలీస్ కస్టడీ నుంచి ప్రభాకర్ రావును విడుదల చేయాలని.. తదుపరి విచారణ వరకు ఎలాంటి వ్యతిరేక చర్యలు తీసుకోవద్దని స్పష్టం చేసింది. పోలీసుల దర్యాప్తుకు సహకరించాలని ప్రభాకర్ రావును సుప్రీంకోర్టు ఆదేశించింది. అంతేకాకుండా ఇంటి నుంచి ఆహారం తెచ్చుకునేందుకు, అవసరమైన మందులు తీసుకునేందుకు ప్రభాకర్ రావుకు సుప్రీం కోర్టు అనుమతి ఇచ్చింది. కాగా.. కొత్త సిట్ ఏర్పాటుతో ట్యాపింగ్ కేసు మరింత వేగవంతంగా విచారణ జరిగే అవకాశం ఉంది. హైదరాబాద్ సీపీ సజ్జనార్



నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. సీపీ సజ్జనార్‌తో పాటు రామగుండం సీపీ ఆంబరి కిషోర్ జా కూడా సిట్‌లో ఉన్నారు. గతంలో వెస్ట్ జోన్ డీసీపీగా ఉన్న సమయంలో ఫోన్ ట్యాపింగ్ కేసులో సిద్ధిపేట సీపీ విజయ్ కుమార్ కీలకంగా వ్యవహరించిన విషయం తెలిసిందే. మాదాపూర్ డీసీపీ రితి రాజ్, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డితో పాటు రవీందర్, వెంకట గిరి, కేఎస్ రావు, శ్రీధర్, నాగేందర్ రావుతో కొత్త సిట్ ఏర్పాటు అయ్యింది.

## త్వరలోనే మంత్రిని అవుతా - ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి



**హైదరాబాద్,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అదృష్టం కలిసి వస్తే త్వరలోనే తనకు మంచి పదవి లభిస్తుందన్న ధీమాను ఆయన వ్యక్తం చేశారు. ఇన్నాళ్లూ ఓపికతో ఎదురుచూశానని.. త్వరలోనే మంత్రి పదవి వస్తుందన్న నమ్మకం ఉందని పేర్కొన్నారు. దీంతో ఆయన ఇప్పుడు చేసిన కామెంట్స్ కాంగ్రెస్ వర్గాలతో పాటు తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారాయి. కాగా గత కొంత కాలంగా రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిని ఆశిస్తూ వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీలో చేరిన సమయంలోనే అధిష్ఠానం తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిందని ఆయన పలుమార్లు బహిరంగంగానే చెప్పారు. అయితే ఆ హామీ ఇప్పటివరకు నెరవేరలేదని.. దీనిపై అనేక సందర్భాల్లో మీడియా సమావేశాల్లో తన అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పార్టీ అంతర్గత పరిణామాలపై కూడా ఆయన చేసిన వ్యాఖ్యలు కొన్నిసార్లు వివాదాస్పదం అయ్యాయి.ఎమ్మెల్యేగా తన నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తున్నానని రాజగోపాల్ రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కూడా నియోజకవర్గ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. అదే మంత్రి పదవి లభిస్తే, మరింత వేగంగా, విస్తృతంగా అభివృద్ధి పనులు చేపట్టే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే గతంలో మంత్రి పదవి దక్కకపోవడంపై అసహనంతో, కాస్త తీవ్ర స్వరంతో మాట్లాడిన రాజగోపాల్ రెడ్డి.. ఇప్పుడు మాత్రం సానుకూల ధోరణితో మాట్లాడటం రాజకీయ వర్గాల్లో చర్చకు దారి తీసింది. ఆయన మాటల్లో కనిపిస్తున్న ఆశావహ ధోరణి, అధిష్ఠానం నుంచి ఏమైనా సానుకూల సంకేతాలు అందాయా? అనే ఊహాగానాలకు బలం చేకూరుస్తోంది. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌లో మంత్రి మండలి విస్తరణ జరిగితే.. రాజగోపాల్ రెడ్డి పేరు పరిశీలనలో ఉండే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.


**మహారాజశ్రీ 7వ అదనపు సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కోర్టు, విజయవాడ**

FDP. No. 11/2025 In O.S.No. 240/2018

Between :-
Balthu Geetha Bhavani ... Petitioner/Plaintiff
And
Balthu Venkata Durga Rao And 15 Others ... Respondents/ Defendants

**Respondents యొక్క వివరములు :**

**R-2 :** Balthu Savithramma, W/o. Late Kotayya, Resident of D.No. 42-3/2-1, Rama Krishnapuram, Vijayawada - 520015.

**R-6 :** Manukonda Adinarayana Reddy, S/o. Bhupala Reddy, Resident of D.No. 23-39-16, Alluri Seetharamaraju Street, Vijayawada - 520011.

**R-7 :** Bhupathiraju Rajyalakshmi, W/o. Vishwanatha Rao, Resident of D.No. 21-8-45/1, Rangaraju Street, Muthyalampadu, Vijayawada - 520011.

**R-11 :** Dendukuri Venkateswara Raju, S/o. Appala Raju, Resident of D.No. 21-5-A/1, Vanapalavari Street, Muthyalampadu, Vijayawada - 520011.

**R-16 :** Balthu Eshwar, S/o. Balthu Venkata Durga Rao, Resident of D.No. 42-3/2-1, Rama Krishnapuram, Vijayawada - 520015.

పై తెలిపిన పిటిషన్ నందు రెస్పాండెంట్స్ నెంబర్స్ 2, 6, 7, 11 మరియు 16 వార్లు అయిన మీరు కోర్టు నోటీసులు ఉద్దేశ్య పూర్వకముగా తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఆర్డర్ మేరకు ఈ పేపరు పబ్లికేషన్ ద్వారా మీకు నోటీసులు పంపటమైనది. ది. 29-12-2025వ తేదీన మీరు స్వయముగా గాని లేదా మీ అడ్వొకేట్ గారి ద్వారా గాని ఉదయము 10-30 గంటలకు శ్రీ కోర్టు వారి యెదుట హాజరు అయి మీ వాదనను తెలుపగలరు. లేని యెడల శ్రీ కోర్టు వారు మీ పరోక్షమున పిటిషన్‌ను తీర్మానము చేయగలరు.

(By Court Order)

ఇట్లు

**దుర్గరాజు బుచ్చిబాబు**
Advocate for Petitioner/Plaintiff
Vijayawada, Mobile : 8885314444.

18-12-2025


## రాజమండ్రిలో విద్యార్థులతో మంత్రి నారా లోకేశ్ ముఖాముఖి



**రాజమండ్రి,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** సమాజంలో మనం ఆశించే మార్పు రావాలంటే యువత రాజకీయాల్లోకి రావాలని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. రాజకీయాలపై ఆసక్తి ఉన్న యువతకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించిన 'హలో లోకేశ్' ముఖాముఖి కార్యక్రమంలో ఓ విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ విధంగా స్పందించారు. "యువత రాజకీయాల్లోకి రావాలని మీరు అంటున్నారు. మరి మీరు నాకు మెంటర్‌గా వ్యవహరిస్తారా?" అని కిరణ్ అనే విద్యార్థి లోకేశ్ ను నేరుగా ప్రశ్నించారు. దీనికి సానుకూలంగా స్పందించిన మంత్రి, "మేం కచ్చితంగా యువతను రాజకీయాల్లోకి ఆహ్వానిస్తున్నాం. నీ గ్రాడ్యుయేషన్ పూర్తయిన తర్వాత తప్పకుండా నీకు మెంటర్‌గా ఉంటాను. నీ ఫోన్ నంబర్ ఇవ్వు" అని చెప్పడంతో సభ చప్పట్లతో మార్మోగింది. ఈ సందర్భంగా ఇతర విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేశ్ ఓపికగా సమాధానమిచ్చారు. ఐదేళ్లలో 20 లక్షల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని నిలబెట్టుకుంటామని స్పష్టం చేశారు. వచ్చే జనవరి నెలలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. యువతకు ఉద్యోగ అవకాశాలు పెంచేందుకు అకడమిక్స్‌ను పరిశ్రమలతో అనుసంధానిస్తున్నామని, రాష్ట్రంలో 22 పారిశ్రామిక క్లస్టర్లను గుర్తించామని తెలిపారు.

## గోదావరి పుష్కరాలకు తగిన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయండి:సిఎస్ ఆదేశం



**అమరావతి,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** 2027 జూన్ 26 నుండి జూలై 7వతేదీ వరకు 12 రోజుల పాటు జరగనున్న గోదావరి పుష్కరాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటి నుండే ఆయా శాఖలు,జిల్లాల వారీగా తగిన కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కార్యదర్శులను ఆదేశించారు.గోదావరి పుష్కరాలపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కార్యదర్శుల కమిటీ సమావేశం శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సిఎస్ అధ్యక్షతన జరింగింది.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి పుష్కరాల సహ్నహక ఏర్పాట్లకు సంబంధించి ఇది మొదటి ప్రాధమిక సమావేశం కావున ఇప్పటి నుండే తగిన ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్ల పర్యవేక్షణకు రాష్ట్ర స్థాయిలో మంత్రుల బృందాన్ని,కార్యదర్శుల బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమీషనర్ జి.వీరపాండ్యను ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగిందని తెలిపారు. జిల్లా స్థాయిలో కూడా ఆయా శాఖల అధికారులతో జిల్లా కమిటీలను కూడా ఏర్పాటు చేసుకుని ఎప్పటికప్పుడు పనుల పర్యవేక్షణకు చర్యలు తీసుకోవాలని కలక్టర్లకు సూచించారు. ఇప్పటినుండే ఆయా జిల్లాల వారీగా స్నాన ఘట్టాల వారీగా శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపై మైక్రో ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు.ముఖ్యంగా స్నాన ఘట్టాలను గుర్తించడం,తాగునీరు, పారిశుద్ధ్యం,రవాణా,వైద్య శిబిరాలు, భద్రత,జనసమూహ నిర్వహణ, ట్రాఫిక్ నిర్వహణ,అత్యవసర సేవల సమన్వయం చేయడం వంటి అంశాలపై వివరణాత్మక డిపిఆర్ లను సిద్ధం చేసి పంపడం వంటి చర్యలు చేపట్టాలని కలక్టర్లను ఆదేశిచారు. గత పుష్కరాలతో పోల్చితే ప్రస్తుతం జనాభా పెరగడం,ప్రసార మాధ్యమాలు ప్రసారం,సాంకేతికత పెరగడం,రవాణా సౌకర్యాలు మెరుగుపడడం అన్నిటికంటే ముఖ్యంగా ప్రజల్లో భక్తిభావాలు పెంపొందడం వంటి కారణాల వల్ల 2027లో జరిగే పుష్కరాలకు రెట్టింపు స్థాయిలో భక్తులు వచ్చే అవకాశం ఉందని అందుకనుణంగా తగిన ఏర్పాట్లు చేయాలని సిఎస్ ఆదేశించారు. మన రాష్ట్రంలో గోదావరి నది అల్లూరి సీతారామరాజు జిల్లాలో ప్రవేశించి ఏలూరు, తూర్పు గోదావరి,కాకినాడ,పశ్చిమ గోదావరి,అంబేద్కర్ కోనసీమ జిల్లాల మీదగా ప్రవహిస్తుందని ఈ ఆరు జిల్లాల్లో వివిధ స్నాన ఘట్టాల వద్ద భక్తులు పుణ్య స్నానాలు ఆచరించేదుంకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని సిఎస్ విజయానంద్ అన్నారు.గోదావరి పుష్కరా లను విజయవంతం చేసేందుకు దేవాదాయ,నీటిపారుదల, రెవెన్యూ, పోలీస్, ఆర్అండ్బి,పురపాలక మరియు పట్టణాభివృద్ధి, పంచాయితీరాజ్ మరియు గ్రామీణాభివృద్ధి, ట్రాన్సుకో,మత్స్య, అగ్నిమాపక,ఎపిఎస్ఆర్టీసి,రైల్వే,పర్యాటక,సమాచార పౌర సంబంధాలు, విపత్తుల నిర్వహణ తదితర శాఖలు సమన్వయంతో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. రానున్న గోదావరి పుష్కరాల జన సమూహాల నిరంతర పర్యవేక్షణకు ఐటి,ఆర్టీజిఎస్ ల ద్వారా తగిన సాంకేతికతను సిద్ధం చేయాలని చెప్పారు.ముఖ్యంగా ఏఏ తేదీల్లో అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉందో ఆతేదీల్లో జన సమూహ సమర్ధనిర్వహణకు తగిన ప్రణాళికు సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ అధికారులను ఆదేశించారు. ఈ ఏడాది ఉత్తరప్రదేశ్ అలహాబాదులో జరిగిన గంగానది మహా కుంభమేళలో జరిగిన అనుభవాలను గత గోదావరి పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏఏ తేదీల్లో అధిక సంఖ్యలో భక్తులు వస్తారనే దానిపై అంచనా వేసి అందుకు రెట్టింపు స్థాయిలో ఏర్పాట్లు చేసేలా కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ కార్యదర్శులను ఆదేశించారు. రాజమహేంద్రవరం ప్రధాన కేంద్రంగా గోదావరి పుష్కరాలు జరగునున్నందున మహా కుంభమేళాలో ఏర్పాటు చేసిన విధంగా వివిధ ప్రాంతాలను గుర్తించి అక్కడ తాత్కాలిక టెంట్ సిటీలు ఏర్పాటు చేసి అధిక సంఖ్యలో భక్తులకు తాత్కాలిక వసతి కల్పనకు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.గోదావరి పుష్కరాల ఏర్పాట్లకు సంబంధించి ప్రతి జిల్లాల్లో జెసి స్థాయి అధికారిని ప్రత్యేకంగా ఇన్చార్జిగా నియమించాలని,ప్రతి జిల్లాకు ఒక సవివర ప్రాజెక్టు నివేదికను సిద్ధం చేయాలని సిఎస్ విజయానంద్ కలక్టర్లకు సూచించారు. ఈసమావేశంలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి హరి జవహరలాల్ పుష్కరాల ఏర్పాట్లపై ప్రెజెంటేషన్ ఇస్తూ బృహస్పతి సింహరాశిలో ప్రవేశించిన సందర్భంలో గోదావరి పుష్కరాలు జరుగుతాయని ఆప్రకారం 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకూ 12 రోజుల పాటు గోదావరి పుష్కరాలను నిర్వహించాలని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించడం జరిగిందని చెప్పారు.గోదవరి పుష్కరాలను దక్షిణ భారతదేశపు ప్రధాన కుంభమేళాగా పేర్కొంటారని అన్నారు.పుష్కరాల సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల భక్తులే కాకుండా దేశవ్యాప్తంగా భక్తులు పాల్గొని గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించడం,తమ పూర్వీకుల పేరిట పిండ ప్రదానాలు, కర్మకాండలు నిర్వహించడం వంటివి నిర్వహిస్తారని వివరించారు. గోదావరి నది అల్లూరి సీతారామ రాజు జిల్లా గుండాల వద్ద రాష్ట్రంలో ప్రవేశిస్తుందని అక్కడ మొదటి స్నానఘట్టం ఉంటుందని అన్నారు. గోదావరి పుష్కరాలకు సంబంధించి లోగోను రూపొందించాల్సి ఉందని ఇందుకు సంబంధించి త్వరలో విద్యార్థులు,ప్రజల నుండి ఎంట్రీలు ఆహ్వానించి మంచి లోగోను ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.

## మాజీ రౌడీషీటర్ చేతిలో వరంగల్.. మంత్రి కొండా సురేఖపై తిరుగుబాటు!



**వరంగల్, డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** మంత్రి కొండా సురేఖ సొంత నియోజకవర్గంలో ఆమెపైన అసమ్మతి ఆగడం లేదు. నిన్న మొన్నటి దాకా కొండా సురేఖ వర్గంగా తిరిగిన నేతలు సురేఖ వైఖరి పైన తిరుగుబాటు బావుటా ఎగురవేశారు.

వరంగల్ ఒక రౌడీషీటర్ చేతిలోకి వెళ్లిందని మంత్రి కొండా సురేఖ తన చర్యలతో పార్టీ పరువును దిగజారుస్తున్నారు అని మండిపడుతున్నారు.

**సురేఖ వర్సెస్ లోకల్ లీడర్స్..** తాజాగా వరంగల్లో పర్యటిస్తున్న కొండ సురేఖ తనను వదిలి వెళ్ళిన ప్రధాన అనుచరులను ఉద్దేశించి చిల్లర గాళ్ళు అని చేసిన వ్యాఖ్యలతో వారంతా ఒక్కసారిగా భగ్గుమన్నారు. ప్రెస్ మీట్ పెట్టి మరీ సురేఖ చర్యలను తూర్పార పట్టారు. మంత్రి కొండా సురేఖ తాజాగా చేసిన వ్యాఖ్యల పైన కాంగ్రెస్ సీనియర్లు స్పందించారు. పిసిసి సభ్యుడు నల్గొండ రమేష్ 40 ఏళ్లుగా పార్టీ కోసం పని చేస్తున్న మా గురించి కొండ సురేఖ మాట్లాడడం ఖండిస్తున్నామన్నారు.

**పార్టీలు మారింది కొండా సురేఖ తాము కాదన్న సీనియర్లు..** చిల్లర గాళ్ళంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సీనియర్ల మనోభావాలను దెబ్బతీస్తున్నాయి అన్నారు. వైఎస్ఆర్సిపి, టిఆర్ఎస్, కాంగ్రెస్ అంటూ పార్టీలు మారింది కొండా సురేఖ అని తాము కాదని స్పష్టం చేశారు. పార్టీ పరువును బజారుకీడుస్తూ చిల్లర పనులు చేసింది ఎవరో ప్రజలు గమనిస్తున్నారని సురేఖను టార్గెట్ చేశారు. శాసనసభ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపించింది తామేనని మర్చిపోవద్దు అన్నారు .

**మాజీ రౌడీ షీటర్ చేతిలో వరంగల్ తూర్పు..** ఎన్ని పార్టీలు మారి వచ్చినా కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిపించిన ఘనత తమదని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు. కార్పొరేటర్లు నియోజకవర్గ ఎమ్మెల్యేని కలవాలంటే ఒక అడ్రస్ లేని అనామకుడి అనుమతి తీసుకోవాలని, అట్లాంటి పరిస్థితి కొండా సురేఖ దగ్గర ఉందన్నారు. ఓ మాజీ రౌడీ షీటర్ చేతిలో వరంగల్ తూర్పును పెట్టి కొండా సురేఖ నియోజకవర్గాన్ని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు.

**సురేఖ వ్యాఖ్యలు వెనక్కు తీసుకోవాలని డిమాండ్..** స్వపక్షం ప్రతిపక్షం లేకుండా అక్రమ కేసులు పెట్టిన ఘనత కొండా సురేఖదని విమర్శించారు. పార్టీలో కార్యకర్త హోదా లేని వ్యక్తి దగ్గరికి కార్పొరేటర్లు నాయకులు వెళ్లేలా చిల్లర వేషం వేసింది మీరేనని తూర్పార పట్టారు. సీనియర్లను చిల్లరగాళ్ళు అంటూ కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇక తాజా పరిణామాలతో వరంగల్ తూర్పున రాజకీయం రసకందాయంలో పడింది.

## అవినీతికి ఆస్కారం లేకుండా పని చేయండి

● వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్ల సమస్యలను పరిష్కరిస్తా ● సంఘాల నేతలకు రెవెన్యూ మంత్రి అనగాని హామీ



**అమరావతి,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ మరియు స్టాంప్స్ శాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్ ను శుక్రవారం ఆంధ్రప్రదేశ్ వీఆర్వో అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ వి.ఆర్.ఎ సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ, ఏపీ గ్రామ సర్వేయర్ల అసోసియేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను మంత్రి అనగాని సత్యప్రసాద్ కు వివరించారు. తమకు ప్రమోషన్లు ఇవ్వాలని మూడు సంఘాల వారు కోరారు. దీనిపై అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకుంటామని మంత్రి అనగాని హామీ ఇచ్చారు. వీఆర్వో అసోసియేషన్ నాయకులు రవీంద్ర మాట్లాడుతూ తమకు రోజూ గ్రామ సచివాలయాల కెళ్లి హాజరు వేయించుకోవడం సమస్యగా ఉందని, తాము ఎక్కడ పనిలో ఉంటే అక్కడ నుండే హాజరు వేసే విధంగా వెసులుబాటు కల్పించాలని కోరారు. అదే విధంగా రెవిన్యూ శాఖ విధుల్లో ఉన్నప్పుడు కూడా వేరే విధులు కూడా చేయాలని గ్రామ సచివాలయాల అధికారులు ఒత్తిడి చేస్తున్నారని, దీని వల్ల రెవెన్యూ శాఖ పనిని సరిగ్గా చేయలేకపోతున్నామని తెలిపారు. తమకు గ్రామ సచివాలయాల్లో ఒక కంప్యూటర్ ను ఏర్పాటు చేస్తే ఇక ఈ ఆఫీస్ ద్వారా మాత్రమే రోజువారీ విధులు నిర్వహిస్తామని కోరారు. సర్వేయర్ల అసోయేషన్ నాయకులు మాట్లాడుతూ తమను టెక్నికల్ పోస్టులుగా గుర్తించాలని కోరారు. ఈ అంశాలపైన రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సాయి ప్రసాద్ తో చర్చించి అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటానని మంత్రి అనగాని వారికి హామీనిచ్చారు. అయితే వీఆర్వో, వీఆర్ఎ, సర్వేయర్లు అందరూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలన్నారు. అవినీతికి సంబంధించి ఆరోపణలు వస్తున్నాయని, దానికి అస్కారంగా లేకుండా పని చేయాలన్నారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం కోసం మీ దగ్గరికి వచ్చే ప్రజలను సంతృప్తి పరిచేలా పని చేయాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ కోరారు.

## మిట్ట కంకల్ ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన నేతలకు ఘన సన్మానం





**వికారాబాద్, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వికారాబాద్ జిల్లా, పరిగి నియోజకవర్గం, పూడూరు మండల్ మిట్ట కంకల్ గ్రామంలో నూతనంగా సర్పంచ్ ఎన్నికల్లో సర్పంచ్ గా రావుల గోపాల్ కుర్మా, ఉప సర్పంచ్ గా మొగ్రి బందయ్య, మరియు వార్డ్ మెంబర్లు ఎన్నికయ్యారు. ఈ సందర్భ ంగా సర్పంచ్ గా ఎన్నికైన రావుల గోపాల్ కుర్మా, ఉప సర్పంచ్ గా ఎన్నికైన మొగ్రి బందయ్య, వార్డ్ మెంబర్లను ఘన సన్మాన కార్యక్రమం గ్రామ పెద్దల సమక్షంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది కదుమూరు ఆనందం, బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్, మాజీ సర్పంచ్ ముగ్రి శ్యాం కుమార్, మాజీ డిఎస్పి బంటు రాములు, వెంకట్ రెడ్డి, జక్రియ భాయ్, గ్రామ పెద్దలు మహిళా సోదరిమణులు యువజన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సర్పంచ్ రావుల గోపాల్,ఉప సర్పంచ్ మొగ్రి బందయ్య, వార్డు సభ్యులు బేరి సత్యనారాయణ, రావుల సుమతమ్మ, చాకలి లక్ష్మయ్య, మొగ్రి . శ్రీనివాస్, రావుల రాములమ్మ, రావుల మనీష్ కుమార్, మొగ్రి. అండాలు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారందరికీ శుభాకాంక్షలు తెలియజేసారు. కదుమూరు ఆనందం మాట్లాడుతూ గ్రామంలో గెలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్ వార్డ్ మెంబర్లు మరియు ఓడిపోయిన సభ్యులందరూ కలిసి మెలిసి గ్రామ అభివృద్ధి చేయాలని సభ్యులని కోరారు. బిసి నేత బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ గ్రామంలో సర్పంచ్ గా, ఉప సర్పంచ్ గా, వార్డు మెంబర్లుగా గెలిచిన వారందరూ ఐక్యమత్యంతో గ్రామ అభివృద్ధి జరిపించాలని అన్నారు. గ్రామ అభివృద్ధి మనందరి బాధ్యతని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు ఐక్యమత్యంతో ఉండాలని అన్నారు. గ్రామంలో పెద్దలను, మహిళలను ప్రతి ఒక్కరిని ఒకరినొకరు గౌరవించుకోవాలని అన్నారు.

## ఆరుగురు మట్కా జూదరులను అరెస్టు చేసిన కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విశ్వసనీయ సమాచారం మేరకు కొత్తగూడెం మూడో పట్టణ పోలీసులు శుక్రవారం సాయంత్రం 4 గంటల సమయంలో మట్కా ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు.కొత్తగూడెం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రధాన బ్రాంచ్ వెనుకవైపు గల కూలీలైన్లో ఈ ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు మూడో పటాన్ ఇన్స్పెక్టర్ శివప్రసాద్ తెలిపారు.పట్టుబడిన వారి వద్ద నుండి 14,170/- రూపాయల నగదున,06 మొబైల్ ఫోన్లను స్వాదీనం చేసుకున్నారు.

**పట్టుబడిన వ్యక్తుల వివరాలు** 1). ఊమ్మళ్ల దుర్గాప్రసాద్ S/O లక్ష్మి నారాయణ, 32 సం,బిజినెస్, R/o.కూలీ లైన్, కొత్తగూడెం. 2). రాచర్ల రాజు S/O. లేటు రాజయ్య,36 సంవత్సరాలు,ఇస్త్రీ పని, R/o.లెనిన్ నగర్ మేదరబస్తి కొత్తగూడెం, 3) ఇందారపు పవన్ కుమార్ S/O శ్రీనివాస్, 27 సం,కూలి,R/o.కూలీ లైన్, కొత్తగూడెం. 4).మేకతోటి విజయకుమార్ S/O.రాజు, 32 సంవత్సరాలు,కూలి,R/o కూలీ లైన్,కొత్తగూడెం.5) మనబోతుల రామ్ కుమార్ S/O.కోటి లింగం, 70 సంవత్సరాలు,రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి, R/o.హనుమన్ బస్తి,కొత్తగూడెం.6) వాగబోయిన రాము S/O..భద్రయ్య, 54 సంవత్సరాలు,కూలీ, R/o.ఫ్యూన్ బస్తి,కొత్తగూడెం.ఎవరైనా మట్కా,బెట్టింగ్,పేకాట,కోడి పందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని సూచించారు.జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ సూచనలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఇన్స్పెక్టర్ శివప్రసాద్ వెల్లడించారు.

## ఆర్టీసీ డ్రైవర్ కు తోటి ఉద్యోగుల వితరణ



**కూకట్ పల్లి డిసెంబరు 19(వార్త ప్రభ):**కూకట్ పల్లి డిపోలో విధులు నిర్వర్తిస్తూ అకాల మరణం చెందిన ఆర్టీసీ డ్రైవర్ ఏ.సతీష్ కుమార్ కుటుంబ సభ్యులకు డిపో లో పనిచేస్తున్న ఉద్యోగస్తులు భరోసాను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.తోటి ఉద్యోగుల ద్వారా వసూలు చేసిన 1,50,000 రూపాయలు డిపో అధికారులైన డిపో మేనేజర్ హరి,శ్రీలత చేతుల మీదుగా శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా డి ఎం హరి మాట్లాడుతూ డిపో ఉద్యోగస్తులు స్పందించిన తీరును ప్రశంసిస్తూ ఓదార్చే మనస్సు కన్నాసహాయం చేసే చేతులు మిన్న చెబుతూ సమాజంలోని తోటి వారికి ఆపద వచ్చినప్పుడు మేమున్నాం అనే భరోసానిచ్చే మనసులు నేడు కరువయ్యారు అన్నారు. ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి మానవత్వాన్ని చాటుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ శ్రీలత, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి కారణం అయిన ఎం ఐలయ్య,దాసరి లక్ష్మయ్య,పి శేఖర్,అక్బర్,ఎన్ ఆర్ శీను సాయిలు మిగతా ఉద్యోగస్తులను డిపో మేనేజర్ మనస్ఫూర్తిగా అభినందించారు

# ఉద్యోగుల అంకితభావం తోనే ఇది సాధ్యం

**తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ అగర్వాల్**



**హైదరాబాద్ :డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉద్యోగుల అంకితభావం తోనే మహేష్ బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు ఎన్నికల్లో వ్యవస్థాపక ప్యానెల్ టీమ్ భారీ మెజారిటీతో విజయం సాధించిందని తెలంగాణ అగర్వాల్ సమాజ్ అధ్యక్షుడు అనిరుధ్ అగర్వాల్ అన్నారు. ఈ విజయాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సభలో రాజస్థానీ సమాజానికి చెందిన 36 కులాలు పాల్గొని నూతనంగా ఎన్నికైన డైరెక్టర్లకు ఘనస్వాగతం పలికాయి. రమేష్ కుమార్ బంగ్ , ఇతర డైరెక్టర్లను బ్యాండ్ మేళాలు, బాణసంచా వెలుగుల మధ్య అట్టహాసంగా ఆహ్వానించారు. రాజస్థానీ సమాజంలోని 36 కులాలు టీమ్‌ను సన్మానించాయి. ప్యానెల్ కన్వీనర్ రమేష్ కుమార్ బంగ్ మాట్లాడుతూ ఈ విజయం ఓటర్లు, మాజీ డైరెక్టర్లు, వాటాదారులు, రాజస్థానీ సమాజం మొత్తం తమపై ఉంచిన నమ్మకానికి నిదర్శనమని అన్నారు. గత 15 ఏళ్లలో బ్యాంక్ వ్యాపారం 9 రెట్లు పెరిగి రూ . 4,450 కోట్లకు చేరుకుందని ఆయన తెలిపారు. వ్యవస్థాపకుల నిస్వార్థ సేవ, ఉద్యోగుల అంకితభావం వల్లే ఇది సాధ్యమైందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈ సభలో లక్ష్మీనారాయణ రాఠీ, అమితాబ్ లడ్డా, మురళీ మనోహర్ పలోడ్, గోవింద్ నారాయణ్ రాఠీ, వినోద్ కుమార్ బంగ్ వంటి ప్రముఖులతో పాటు అనేక సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అగర్వాల్ సమాజ్, జైన్ సమాజ్, గుర్జర్ సమాజ్, నిజామాబాద్, పెద్దపల్లి, విజయవాడ నుండి వచ్చిన వివిధ బృందాలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. కార్యక్రమ నిర్వహణను కన్హయ్య లాల్ రాఠీ చేపట్టారు.

# ప్రమాదాలు జరిగితేనే పట్టించుకుంటారా?

- రోడ్డుకి ఇరువైపుల వైన్స్ షాపులు వైన్ షాపులు బెల్టు షాపులు
- ఆగ్రహిస్తున్న ప్రజలు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్, సుజాతనగర్ కార్పొరేషన్ ఏర్పాటు వలన దినాభివృద్ధి చెందుతుంది ఒకప్పుడు గ్రామీణ ప్రాంతంగా ఉండే సుజాతనగర్ మేజర్ గ్రామపంచాయతీ ఇప్పుడు కార్పొరేషన్ గా మారి కొత్త రూపులు దిద్దుకుంటుంది సుజాతనగర్ పంచాయతీగా ఉన్నప్పుడు రెండు వైన్స్ షాప్ లు మాత్రమే ప్రధాన రహదారికి దూరంగా ఉండేది సుజాతనగర్ ఏడు పంచాయతీలు కార్పొరేషన్లో విలీనం కావడంతో ప్రభుత్వం ఆదయ మార్గం పెంచుకోవడం కోసం ఇప్పుడు మాత్రం సుజాతనగర్ ప్రధాన రహదారి పక్కన నాలుగు వైన్ షాపులు ఏర్పాటు చేశారు మరోపక్క రోడ్డంతా బెల్ట్ షాపులు దీనివలన కొత్తగూడెం నుండి ఖమ్మం వైపు వెళ్లే ప్రధాన రహదారి కావడంతో రోడ్డుపై వెళ్లే వాహరదారులు మద్యం సేవించి రోడ్డుకి దగ్గరలో వాహనాలు నిలిపి మద్యం ప్రియులు రోడ్లపై వీరంగం సృష్టిస్తున్నారు గురువారం నాడు సుజాతనగర్ తిరుమల వైన్స్ దగ్గర స్విఫ్ట్ డిజైర్ కారు అతివేగంగా వచ్చి పల్టీ కొట్టింది సమయానికి ఎవరూ లేకపోవడంతో అక్కడ పెను ప్రమాదం తప్పింది దీంతో అంత ఊపిరి పీల్చుకున్నారు వైన్ షాప్ లో దగ్గరగా ఉండడంతో నిత్య రద్దీగా ఉండే ప్రధాన రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉంది ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన వైన్ షాపుల దగ్గర హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రత్యేకంగా వాహన పార్కింగ్ ప్రదేశాలను ఏర్పాటు చేయాలని సుజాతనగర్ మండల ప్రజలు కోరుతున్నారు

# వనరులపై అర్కస్ తిర్కస్ నిఘా!!

- గోదారమ్మ సంపదపై "ఇసుక మాఫియా" కన్ను
- పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుక దోపిడి
- ఎట్ల అయితే గట్లాయే తోడండి.... నింపండి అంటున్న మాఫియా
- తెరవెనుక ఏ నేతల అండదండలు ఉన్నాయో?
- అడ్డుకోవడానికి వెనుకంజ వేస్తున్న అధికారులు?



**పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 19 (వార్తాప్రభ ప్రతినిధి)**సహజ వనరులపై అర్కస్ తిర్కస్ నిఘా ఉండటంతో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక తవ్వి ట్రాక్టర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి భారీగా ఆర్జిస్తున్నారు ఇసుక మాఫియా. కొందరి కనుసన్నల్లో ఇసుక మాఫియా పేట్రేగిపోతున్నది. అక్రమార్జనే ధ్యేయంగా ఇసుక దొంగలు ఇష్టాను రీతిగా వ్యవహరిస్తున్నారు. గోదారమ్మ సంపదపై "ఇసుక మాఫియా" కన్నువేసి అక్రమంగా లక్షలు గడిస్తున్నారు. పట్టపగలే ట్రాక్టర్లతో ఇసుక దోపిడి చేస్తున్న అక్రమార్కులకు ఒక (అందరికీ తెలిసిన పార్టీనే) పార్టీకి చెందిన కొంతమంది నేతలు తెరవెనుక నుంచి అండదండలు అందిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ఇసుక అక్రమ తవ్వకందారులపై చర్యలకు అధికారులు సైతం వెనుకడుగు వేస్తున్నట్లు తెలిసింది. రెవెన్యూ, మైనింగ్, పర్యావరణ, జలవనరుల శాఖల నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా రేయింబవళ్లు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వి, వాహనాల్లో తరలిస్తున్నారు. ఇలా ఇసుక మాఫియా చెలరేగిపోతున్న, రాత్రి, పగలు తేడా లేకుండా అడ్డగోలుగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ప్రశ్నించిన వారిని, ఫిర్యాదు చేసిన వారిని బెదిరిస్తూ దాడులకు పాల్పడుతున్నట్లు విశ్వసనీయ ఆరోపణలు సైతం వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా అక్రమ ఇసుక దందాపై, ఇసుక మాఫియాపై ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు గట్టి నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేసి కటకటాలు లెక్కించాలనేది మెజారిటీ ప్రజల డిమాండ్.

# శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఆయుర్వేదం!!

- ఆరోగ్యం కోసం సైడ్ ఎఫెక్ట్స్ లేని మూలికల మందులు
- దీర్ఘకాలిక వ్యాధులకు చక్కటి ఉపశమనం
- ప్రజా ఆరోగ్య సేవలో మాతా రీసెర్చ్ ఇనిస్టిట్యూట్
- ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ విశ్వనాథ మహర్షి

**పెద్దపల్లి/ గోదావరిఖని: డిసెంబర్ 19 (వార్తాప్రభ ప్రతినిధి)** శారీరక, మానసిక ఆరోగ్యం కోసం ఆయుర్వేదం ఎంతగానో దోహదం చేస్తుంది అని ప్రముఖ ఆయుర్వేద డాక్టర్ విశ్వనాథ మహర్షి అన్నారు. ఈ మేరకు శుక్రవారం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మాత రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ సహకారంతో గోదావరిఖని రిక్రియేషన్ క్లబ్ హాల్లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ విశ్వనాథ మహర్షి మీడియాతో మాట్లాడుతూ.... రోగులకు, ప్రజలకు ఆయుర్వేద వైద్యంపై పలు సూచనలు చేశారు. ఆయుర్వేద మందులు శరీరానికి మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి, ఒత్తిడిని తగ్గించడానికి, మానసిక ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడతాయి అని తెలిపారు. ఇవి మూలికలు, ఖనిజాలు, జంతువుల సారం వంటి సహజ పదార్థాల నుండి తయారు చేయబడతాయి అని దగ్గు, జలుబు, ఆర్థరైటిస్, అధిక కొలెస్ట్రాల్ వంటి సాధారణ వ్యాధులకు చికిత్స చేస్తాయి అని అన్నారు. కీళ్ల నొప్పులు, కాళ్ల నొప్పులు, మోకాళ్ళలో గుజ్జు పునర్నిర్మించడానికి వివిధ రకాల మందులు ఆయుర్వేదంలో అందుబాటులో ఉన్నట్లు



తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన బిపి, షుగర్, థైరాయిడ్, మలబద్ధకం, అల్సర్ తదితర ఇబ్బందికర వ్యాధులకు సైతం చక్కటి ఉపశమనం కలిగించే మందులను తమ ఇన్స్టిట్యూట్ ద్వారా అందజేస్తున్నట్లు తెలిపారు..

# ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించాలి - జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాలపల్లి, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ధర్మ ప్రచారం ద్వారా ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్యమును పెంపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.ధర్మ ప్రచారంలో భాగంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో యాదగిరి గుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్న సందర్భంగా మొట్టమొదటిసారిగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు విచ్చేసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ధర్మ ప్రచార రథానికి ఐ.డి.ఓ.సి కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ స్వాగతం పలికి శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. రథం ముందు కొబ్బరికాయ కొట్టి ధర్మ ప్రచారాన్ని ప్రారంభించారు. శనివారం జిల్లా కేంద్రంలోని సుభాష్ కాలనీ రామాలయంలో నిర్వహించే శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం పోస్టర్ ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ధర్మ ప్రచారంలో భాగంగా శ్రీ యాదాద్రి లక్ష్మీ నరసింహ స్వామి రథం మొట్ట మొదటి సారి భూపాలపల్లి జిల్లాకు రావడం చాలా సంతోషమైన విషయం అని ధర్మ



ప్రచారం ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆర్డీవో రవి, కార్యాలయ ఏ.వో మురళీధర్ రావు, సింగరేణి జిఎం రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్

## ప్రజలు ఇబ్బంది పడుతున్నారు... ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి.



**శేరిలింగంపల్లి,డిసెంబర్ 19 (వార్తాప్రభ):**మియాపూర్ చౌరస్తాలోని ట్రాఫిక్ సమస్య వల్ల చాలా కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బొల్లారం/బాచుపల్లి నుండి వచ్చే వాహనాలను కచ్చితంగా ఎడమ వైపు వెళ్లే విధంగా మళ్లించలని,దీనివల్ల ప్రజలు ట్రాఫిక్ సమస్య నుండి ఉపశమనం కలుగుతుందని దీనికి తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా మియాపూర్ ట్రాఫిక్ సిఐ ని కలిసి వినతిపత్రం ఇవ్వడం జరిగింది.డివిజన్ అధ్యక్షులు ఆకుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి మాణిక్ రావు బిజెపి సీనియర్ నాయకులు,గుండె గణేష్ ముదిరాజ్,రవి గౌడ్,ప్రభాకర్ మరియు అభిరామ్ పాల్గొన్నారు.

## కూకట్ పల్లి ట్రాఫిక్ సిఐ తిమ్మప్ప ను కలిసిన బిజెపి నాయకులు.



**కూకట్ పల్లి,డిసెంబర్ 19(వార్తాప్రభ):**నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కూకట్ పల్లి ట్రాఫిక్ సిఐ తిమ్మప్ప ని, బిజెపి రాష్ట్ర నాయకులు చేదురుపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ ని శాలువాతో సన్మానించడం జరిగింది. కూకట్ పల్లి నియోజకవర్గ పరిధిలో నెలకొన్న వివిధ ట్రాఫిక్ సమస్యలపై సవివరంగా చర్చించి, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సిఐ దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని సిఐ హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో బిజెపి కూకట్ పల్లి డివిజన్ సీనియర్ నాయకులు నర్సింగ్ రావు ,శంకర్ రెడ్డి,రమణారెడ్డి,దుర్గారావు, ప్రశాంత్ రావు,ఫణీంద్ర శేఖర్ రావు,క్రాంతి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి కృషి చేస్తా

**బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్**



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 19, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన వాసా శ్రీనివాసులు గుప్తా, మహాసభ కార్యవర్గ సభ్యులు శుక్రవారం కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా ప్రమాణ స్వీకారం చేసిన వాసా శ్రీనివాసులు గుప్తా, ప్రధాన కార్యదర్శి దారం ఇంద్రసేన గుప్తా, కోశాధికారి పవన్ కుమార్ గుప్తాలను బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ శాలువాలతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ... కుత్బుల్లాపూర్ ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధికి నా సహాయ సహకారాలు ఎప్పుడూ ఉంటాయని, సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆకుల ప్రభాకర్ గుప్తా, తోట బిక్షపతి గుప్తా, బీరెల్లి వేణుగోపాల్ గుప్తా, రమేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## స్కూల్ వ్యాను డ్రైవర్లకు ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు.

**కూకట్ పల్లి డిసెంబర్ 19(వార్త ప్రభ):**ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం రాండంగా కొన్ని స్కూలు వ్యాన్ డ్రైవర్ లకు అకస్మాత్తుగా డ్రంకెన్ డ్రైవ్ టెస్ట్ లు నిర్వహించారు. స్కూలు బస్, స్కూల్ వ్యాన్ డ్రైవర్ లకు కూకట్పల్లి ట్రాఫిక్ పోలీసు లు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి పాఠశాలలకు సంబంధించిన బస్సులను వ్యాన్లను ఇతర వాహనాలను నడప వద్దని అలా చేస్తే సదరు డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని కూకట్ పల్లి ట్రాఫిక్ సిఐ తిమ్మప్ప హెచ్చరించారు.



# ఎడిటోరియల్

## తాగేందుకు నీళ్లే లేవు.. బాటిళ్ల నాణ్యతపై పిటిషనా?

ఇటీవల కాలంలో మన న్యాయస్థానాల్లో దాఖలవుతున్న కొన్ని పిటిషన్లపై న్యాయస్థానాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తుంటాయి. కొందరి తీరును కోర్టులు ఆక్షేపిస్తుంటాయి. వాస్తవ పరిస్థితుల్ని మరిచి.. తమ ప్రయోజనాల కోసం.. పేరు కోసం తపించే పిటిషన్లను నిర్దాక్షిణ్యంగా రిజెక్టు చేయటం కనిపిస్తూనే ఉంటుంది. తాజాగా అలాంటి ఉదంతమే ఒకటి సుప్రీంకోర్టులో చోటు చేసుకుంది. మంచినీళ్ల బాటిళ్ల నాణ్యత అంతర్జాతీయ స్థాయిని పాటించటం లేదంటూ దాఖలైన పిటిషన్ పై సుప్రీంకోర్టు అసహనాన్ని వ్యక్తం చేసింది. అంతేకాదు.. సదరు పిటిషన్ విచారణను తిరస్కరించింది. ఈ సందర్భంగా పిటిషన్ ను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేస్తూ.. ఇది కేవలం లగ్జరీ పిటిషన్ గా పేర్కొనటం గమనార్హం. ఓవైపు దేశంలోని చాలా ప్రాంతాల్లో తాగునీరు అందని పరిస్థితి ఉందని.. ఆ అంశాన్ని వదిలేసి.. అమెరికా, జపాన్, ఈయూ దేశాల్లోని ప్యాకేజ్డ్ వాటర్ బాటిళ్ల నాణ్యత మార్గదర్శకాల్ని భారతదేశంలో ప్రవేశ పెట్టగలమా? అన్న సూటిప్రశ్నను సుప్రీం ధర్మాసనం సంధించింది. భారత్ లోని వాస్తవిక పరిస్థితుల్ని తెలుసుకోవాలని పేర్కొంటూ పిటిషన్ దారుకు ఒక సూచన చేసింది. 'గాంధీజీ దేశానికి వచ్చినప్పుడు.. ఆయన దేశంలోని చాలా మారుమూల ప్రాంతాల్లో పర్యటించారు. మీరు కూడా అలా డెవలప్ మెంట్ నోచుకోని ప్రాంతాల్ని సందర్శించండి. అక్కడి ప్రజలు తాగునీటి కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతుననారో చూడండి. అప్పుడు మీకు మన దేశం అంటే ఏమిటో అర్థమవుతుంది" అంటూ పిటిషన్ దారును ఉద్దేశించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం అసహనాన్ని వ్యక్తం చేసింది. ఈ తరహా పిటిషన్లు అర్బన్ రిచ్ మైండ్ సెట్ తో వేస్తారన్న ధర్మాసనం.. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికి చాలామందికి తాగునీటి సరఫరా సరిగా లేదన్న విషయాన్ని గుర్తు చేసింది. 'వారు శుద్ధి చేయని జలాలపై ఆధారపడుతున్నారు. ముందు వారి గురించి ఆలోచిద్దాం. నీళ్ల బాటిళ్ల నాణ్యత గురించి తర్వాత ఆలోచిద్దాం. ఇది కేవలం లగ్జరీ వ్యాజ్యమే' అంటూ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ.. పిటిషన్ ను విచారణ నుంచి డిస్మిస్ చేసింది. ఈ తరహా పిటిషన్లకు ఆ మాత్రం ఆగ్రహం సముచితమేనని చెప్పాలి.

## మంత్రి పార్థసారథి నిర్వహించిన ప్రజాధర్బార్ కు విశేష స్పందన.

**ప్రజాధర్భార్ లో 36 అర్జీలు, సంబంధిత అధికారులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశాలు. రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి ...**






**ఏలూరు/నూజివీడు, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు రాష్ట్ర మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలు నుండి సాయంత్రం 6 గంటలు వరకు జరిగిన ప్రజాధర్బార్ లో రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొని 36 అర్జీలను స్వీకరించారు. కొన్ని సమస్యలను మంత్రి కొలుసు పార్థసారథి అక్కడికక్కడే పరిష్కారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రజా ధర్భార్ నిర్వహించి, ప్రజలు సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టారని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో రాష్ట్రమంత్రులు, శాసన సభ్యులు తప్పక ప్రజాదర్భారు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. వారం వారం ప్రజాధర్బార్ నిర్వహిస్తున్నామని అన్నారు. వచ్చిన ధరఖాస్తులను నిర్ణీత సమయంలో అధికారులు పరిష్కారం చెయ్యాలని, అధికారులు పరిధిలో లేని సమస్యలను నా దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధిత వివిధ శాఖలు అధికారులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విలువైన వాక్కులు




విలువ తెలిసిన వారితో
స్నేహాన్ని పెంచుకొనుము
ప్రేమలొలుకు మనసుతో
పేదలకు సాయపడుము
జ్ఞానమిచ్చు గురువులతో
మన జన్మ దాతలతో
మర్యాదగా నడుచుకొనుము
వయసులోన పెద్దలతో
శ్రేష్టమైన చేతలతో
స్వచ్ఛమైన తలపులతో
హుందాగా జీవించుము
ఘనులైన మిత్రులతో
పవిత్రమైన బుద్ధితో
చదువులోన శ్రద్ధతో
గొప్పగా రాణించుము
గగనమంత వృద్ధితో

**-గద్వాల సోమన్న**

గణితోపాధ్యాయుడు సెల్: 9966 41458

## ఉన్నతమైన వృత్తి మనది ఇంకా మహోన్నతంగా బతుకుదాం

**● అప్రతిష్ఠ పాలవ్వకుండా గౌరవంగా పౌరోహిత్యం సాగిద్దాం ● కాదంటారా చెప్పండి ఈ సంఘానికి రాజీనామా చేస్తా ● కృష్ణా నదీ తీర్థ పురోహిత సంఘం అధ్యక్షులు బంకుపల్లి రామకృష్ణ శర్మ ● ఇటీవల సర్వసభ్య సమావేశం రాజీనామా అస్త్రాన్ని ప్రయోగించిన సంఘం అధ్యక్షులు ● దాసుడి తప్పులు దండంతో సరి.. చేసిన తప్పులు చెయ్యము హరి హరీ ● వార్తా ప్రభ దినపత్రిక కథనానికి స్పందన**


కృష్ణమ్మ ఘాట్ కి కర్మ కాండలకు వచ్చారో...మీ ఖర్మ కాలినట్టే........

● హిప్నొటైజ్ మాటలతో మీ జేబులు ఖాళీ ● ఇక్కడ చదివేది మంత్రాలకన్నా వశీకరణ మాటలే అధికం ● పిత్ర పిండ ప్రదానం కే రూ 25 వేలు వసూళ్ళు





**(యేమినేని వెంకట రమణ)**

**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 19 : (వార్తా ప్రభ ప్రతినిధి)**ఒక్క మాట.. ఒక్క అనుభవం... లేదా ఒక్క చేదు అనుభవం చాలా మందిలో మార్పు తీసుకొస్తోంది. పవిత్ర కృష్ణా నది ఒడ్డున ఎన్నో క్రతువులు నిర్వహిస్తున్న పురోహితుల్లో కూడా ఒక్క వార్త మార్పు కి బాటలు వేసింది. వాళ్ళల్లో అంతర్మధనం కొంత మార్పు వచ్చిందని చెప్పొచ్చు. ఈ నెల 7 తేదీన వార్తా ప్రభ దినపత్రిక లో ప్రచురితమైన ""కృష్ణమ్మ ఘాట్ కి కర్మ కాండలకు వచ్చారో......మీ ఖర్మ కాలినట్టే....."" కథనంతో పురోహిత సంఘ సభ్యుల్లో అంతర్మథనం మొదలైంది. పెద్దలు అందరూ సమిష్టిగా తర్జనభర్జనలు పడ్డాక తాము చేస్తున్న బలవంతపు, లేదా మానసికంగా బలహీన పర్చి వసూలు చేస్తున్న డబ్బు సంపాదన సరైంది కాదని నిర్ణయానికి వచ్చారు. అందుకే ఈ నెల 17 న వారంతా సంఘం అధ్యక్షులు బంకుపల్లి రామకృష్ణ శర్మ అధ్యక్షత న సమావేశం ఏర్పాటు చేశారని విశ్వసనీయ సమాచారం. ఐతే ""అందరూ వైష్ణవులే రొయ్యలు బుట్ట మాయమైనదనే సామెత చందంగా"" ఆస్తికలు కలపడానికి హైదరాబాద్ నుండి వచ్చిన వారివద్ద నుండి రూ 25 వేలు వసూలు చేసిన వారు మాత్రం "తేలు కుట్టిన దొంగలా" మౌనంగా వున్నారు. జరిగిందేదో జరిగిపోయింది. ఇకనుండి అలాంటి సంఘటన చోటు లేకుండా చేద్దాం అని అందరూ ఓ తాటిమీద కి తెద్దామనే అభిప్రాయం కొందరు వ్యక్తం చేశారు. సంఘం కి పురోహిత వృత్తికి చెడ్డపేరు వస్తోంది కనుక ఇకనుండి తాను అధ్యక్షు పదవికి రాజీనామా చేస్తానని సంఘం అధ్యక్షులు బంకుపల్లి రామకృష్ణ శర్మ తన రాజీనామా అస్త్రాన్ని వదిలారని తెలిసింది. ఐతే పవిత్రతను కాపాడుతూ స్వార్జత కోసం తప్పు దారి పట్టకుండా మాట రానీకుండా పురోహిత వృత్తిని చేద్దామని అందరూ ఏకాభిప్రాయం వ్యక్తం చేయగా కృష్ణా నదీ తీర్థ పురోహిత సంఘానికి రామకృష్ణ శర్మ అధ్యక్షులు గా ఏకగ్రీవ అమోదంతో కొనసాగుతున్నారు.

## కలిమిశ్రీకి ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారం



**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ద్రావిడ విశ్వవిద్యాలయం తొలి ఉపకులపతి, ఆధునిక తెలుగు నిఘంటుకర్త 'మహామ హొపాధ్యాయ' ఆచార్య రవ్వా శ్రీహరి స్మారక సాహితీ పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కలిమిశ్రీకి అంద జేస్తున్నట్టు అఖిల భారత పద్మశాలీయ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు తుమ్మ సత్యనారాయణ, సూరేపల్లి రవికుమార్ ఒక ప్రకటనలో తెలియజేశారు. 13 వేల అచ్చ తెలుగు పదాలను పొందుపరిచిన 'శ్రీహరి నిఘంటువు' ద్వారా తెలుగు భాషకు పట్టం కట్టిన వ్యాకరణ సార్వభౌముడు ఆచార్య రవ్వా శ్రీహరి. తెలుగులో 50 గ్రంథాలు, సంస్కృతంలో 25 గ్రంథాలు రాసిన ఉభయ భాషా ప్రవీణుడి పేరుతో ఇస్తున్న పురస్కారాన్ని మల్లెతీగ సాహిత్యసేవాసంస్థ ద్వారా సాహితీరంగంలో మూడున్నర దశాబ్దాలుగా విరామమెరుగని సేవలందిస్తున్న కలిమిశ్రీకి ఇవ్వనున్నారు. ఆర్థికబలం లేకపోయినా, కలిమిశ్రీ అలసిపోని అనుభవ బలంతో కసితో, కృషితో, కష్టంతో సంపాదించిన సొంత సొమ్ముతో నవమల్లెతీగ సాహిత్య మాసపత్రికను రెండు దశాబ్దాలుగా నిరాటంకంగా నడుపుతున్నారు. కొత్తతరం కవుల్ని తయారు చేసే వందలాది కార్యక్రమాలు చేస్తూ సాహితీరంగంలో కృషి చేస్తున్నారు. కలిమిశ్రీ గత నెల-విజయవాడలో జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించి తెలుగుకు వెలుగు అవసరమని, మన సంస్కృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ఈ సదస్సు ద్వారా మరోసారి గుర్తు చేశారు. కనుమరుగవుతున్న ఒక తరానికి కొనసాగింపుగా మరో కొత్తతరాన్ని తయారుచేసే సాహితీయజ్ఞంలో కలిమిశ్రీ తన కాలాన్ని, వ్యక్తిగత సంతోషాల్ని కోల్పోతున్నారు. ఈ అవార్డును 21న ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ బందరురోడ్డులోగల ఠాగూర్ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న సాహిత్య సాంస్కృతిక కార్యక్రమంలో అందజేస్తున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ నగర మేయర్ శ్రీమతి రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, సుప్రసిద్ధ రచయిత డా.యం.ప్రభాకర్, ఆంధ్రప్రదేశ్ పద్మశాలి కార్పొరేషన్ ఛైర్మన్ నందం అబద్ధయ్య హాజరు కానున్నారు.



## దోమల వల్ల కలిగే వ్యాధుల నివారణ కొరకు ఫ్రైడే డ్రై డే





**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**దోమల వల్ల కలిగే వ్యాధుల నుండి నివారణ కొరకు ఫ్రైడే ఫ్రైడే నిర్వాహణ తో ప్రజలకు అవగాహన కల్పించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం బ్రహ్మారాంబపురం ప్రాంతాలలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజలు దోమల బారిన పడకుండా ఉండేందుకు వీఎంసి సిబ్బంది అవగాహన కల్పించారు. అందులో భాగంగా అక్కడ నివసిస్తున్న ప్రజల వారి ఇళ్లలో ఉన్న నీటి నిల్వలను శుభ్రం చేస్తూ ప్రతి ఫ్రైడే, డ్రై డే నిర్వహించాలని, వారికి అవగాహన కల్పిస్తూ దోమలు పెరగకుండా యాంటి లార్వా ఆపరేషన్లు నిర్వహించారు. మన ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. కూలర్లు, ఫ్లవర్ వాజులు, పూల కుండీల్లో నీటిని తరచూ మార్చాలన్నారు. తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు ,పాత టైర్లు ఖాళీ డబ్బాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఇంటి కిటికీలు, తలుపులకు దోమతెరలు వాడడం ద్వారా దోమకాటు నుండి రక్షణ పొందవచ్చునని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయోలజీస్ట్ కామేశ్వరరావు, స్టేట్ కన్సల్టెంట్ కొండ రెడ్డి, శానిటరీ ఇన్స్పెక్టర్లు, మలేరియా సిబ్బంది, ఏ ఎన్ యం లు, ఆశ వర్కర్లు, పాల్గొన్నారు.

## బీబీఏలో సెమీ క్రిస్మస్ వేడుకలు




**విజయవాడ లీగల్, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి) :**బెజవాడ బార్ అసోసియేషన్ లో శుక్రవారం న బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ కె బాష, జనరల్ సెక్రెటరీ కె.వి.రంగారావు ల ఆధ్వర్యంలో క్రిస్టియన్ న్యాయవాదుల సౌజన్యలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగినాయి. ఈ కార్యక్రమానికి. ఈ కార్యక్రమానికి బెజవాడ బార్ అధ్యక్షులు ఎ కె బాష, గవర్నింగ్ బడీతో పాటు రెండవ అదనపు జిల్లా జడ్జి శ్రీ ఏ సత్యానంద గారు, 3వ అదనపు జిల్లా జడ్జి శ్రీ భాస్కర్ రావు గారు మరియు కమర్షియల్ కోర్టు జడ్జి శ్రీ భూపాల్ రెడ్డి గారు, 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీ సునీల్ కుమార్ గారు, 7వ అదనపు జిల్లా జడ్జి శ్రీ అబ్రహం గారు, చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ శ్రీమతి బెజవాడ రాధా రాణి హాజరై న్యాయవాదులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. రేవ. సి ఎల్ జాస్పర్ పాస్టర్, రేవ. రాజశేఖర్ చాట్ల, రేవ. దేవదానం పాల్గొని న్యాయవాదులకు జీసెస్ మెసేజ్ లు అందించారు. ఈ సందర్భంగా బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ కె బాష మాట్లాడుతూ జీసస్ క్రీస్తు బోధించినట్లుగా దీనుల పట్ల దయ చూపుదాం. బాధపడుతున్నవారికి తోడుగా నిలుద్దాం. అప్పుడే యేసు క్రీస్తు జననం మన జీవితాల్లో సజీవమవుతుందన్నారు. ఈ క్రిస్మస్ మనందరికీ శాంతిని, ప్రేమను, ఆరోగ్యాన్ని, ఆశీర్వాదాలను తీసుకురావాలని క్రీస్తు ప్రభువును ప్రార్థిస్తూ న్యాయవాదులు అందరికీ హృదయపూర్వక క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సెమీ క్రిస్మస్ కి సీనియర్ జూనియర్ న్యాయవాదులు పాల్గొని భక్తి శ్రద్దలతో ప్రత్యేకమైన ప్రార్థనలు చేశారు.

## ప్రాంగణ ఎంపికల్లో ప్రతిభను చాటిన కేబీఎన్ విద్యార్థులు



**విజయవాడ పశ్చిమ, డిసెంబర్ 19: (వార్తా ప్రభ ప్రతినిధి)**హైదరాబాదుకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ సీ ఓక్ ఇన్నోవేషన్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఉద్యోగాలకు ఎంపికైనట్లు కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి కృష్ణవేణి చెప్పారు. తమ కళాశాలలో ఎంబీఏ చదువుతున్న 33 మంది విద్యార్థులు రూ.8 లక్షల వార్షిక వేతనంతో ఈ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ప్లేస్మెంట్ ఆఫీసర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థులు అందరికీ తక్షణ నియామక ఉత్తర్వులు కంపెనీ అందజేసిందన్నారు. కళాశాల కార్యదర్శి డాక్టర్ పి శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వెంకటేశ్వర్రావు, డాక్టర్ కే రామకృష్ణ, పి ఎల్ రమేష్ విద్యార్థులను అభినందించారు.

## కాలుష్య రహిత నగరానికి మరో అడుగు

**కాలుష్యం నియంత్రించే దిశగా వర్క్ షాప్**





**విజయవాడ పశ్చిమ డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలకు మేరకు ప్రధాన కార్యాలయంలో గల నూతన భవనంలోని మీటింగ్ హాల్లో శుక్రవారం ఉదయం నేషనల్ క్లీన్ ఎయిర్ పాలసీలో భాగంగా కాలుష్య నియంత్రణ కొరకు విజయవాడ నగరపాలక సంస్థ వారి ఆధ్వర్యంలో స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. ఈ సందరరేగా చీఫ్ సిటీ ప్లానర్ కె. సంజయ్ రత్నకుమార్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు విజయవాడ నగరపాలక సంస్థ తీసుకుంటున్న చర్యల్లో భాగంగా వన్ టౌన్ లో క్లీన్ ఎయిర్ క్వాలిటీని అధ్యయనం చేశారని, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కాలుష్యాన్ని నియంత్రించేందుకు పరిశోధన ద్వారా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నేషనల్ క్లీన్ ఎయిర్ పాలసీ లో భాగంగా నిర్వహించిన వర్క్ షాప్ లో ముందుగా కాలుష్యానికి అత్యంతగా లోనయ్యే ప్రాంతాల్లో గల వన్ టౌన్ లో నిపుణులు చేసిన పరిశోధనలో వారు పరిశీలించే అంశాలను వివరించారు. ఈ వర్క్ షాప్ లో అసిస్టెంట్ సిటీ ప్లానర్ మోహన్ బాబు, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ విజయవాడ అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ నైనా గుప్త, డాక్టర్ ప్రశాంతి రావు, వీఎంసి ఎన్విరాన్మెంట్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## వైభవంగా పేట తుళ్ళి ఉత్సవం



**కోడూరు, డిసెంబర్19(వార్తా ప్రభ) :**కోడూరులో మాల ధరించిన స్వాములు పేట తుళ్ళి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం కోడూరు అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద నుంచి బయలుదేరివివిధ రకాల వేషధారణలతో, డప్పులు, వాయిద్యాలతో గ్రామ పురవీధులలో ఊరేగింపుగా ఉత్సాహంగా పేట తుళ్ళి నృత్యం చేశారు. అయ్యప్ప స్వామి మహిషి అనే రాక్షసిని సంహరించిన సందరాన్నీ స్మరించుకోవడానికి, ఈ ఉత్సవాన్ని ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీను గురుస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో భవాని,సాతా శీను గురుస్వాములతో పాటు పెద్ద ఎత్తున అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

## సీటు బెల్టు ధరించడంతో తృటిలో తప్పిన ప్రాణాపాయం



**పెనుగంచిప్రోలు, డిశంబర్ 19( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు మండలం నవాబు పేట గ్రామ హైవే సమీపంలో కారులో ప్రయాణిస్తున్న వాహనదారులు సీటు బెల్టు ధరించడంతో రోడ్డు ప్రమాదం జరిగిన స్వల్ప గాయాలతో బయటపడ్డ సంఘటన. జాతీయ రహదారి 65 మీద నవాబుపేట వద్ద మధ్యాహ్నం జరిగింది. తెలంగాణ కు చెందిన పొందూరు ప్రసాద్, భార్య, కుమారుడి తో కలిసి విజయవాడ నుండి ఖమ్మంకు వెళుతున్న సమయంలో పల్టీలు కొట్టిన కారుఈ ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు,కానీ కారులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సీటు బెల్టు పెట్టుకుని ఉండడం వలన ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ అవ్వడం వలన స్వల్ప గాయాలతో బయటపడ్డారని జగ్గయ్యపేట ట్రాఫిక్ ఎస్ఐ. ఆర్ .శ్రీనివాసరావు తెలిపారు.

# విరివిగా పరిశ్రమలను స్థాపించేలా ప్రోత్సహించాలి-జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలో విరివిగా పరిశ్రమలు నెలకొల్పేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్, డిఆర్ఓ కె చంద్రశేఖర రావులతో కలిసి పరిశ్రమలు తదితర అంశాల పురోగతిపై నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏపీఐఐసీ ద్వారా గత 2 సంవత్సరాల లోపు మల్లవల్లి, వీరపనేని గూడెం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమల ఏర్పాటుకు అన్ని అనుమతులు పొంది ఇంకా యూనిట్లను ప్రారంభించని దాదాపు 400 మంది పారిశ్రామికవేత్తల జాబితా తయారుచేసి వారి యూనిట్లు వెంటనే నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం ఈ నెల 30వ తేదీన వారితో ఒక సమావేశం నిర్వహించి అందరిని ప్రోత్సహించాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే వాటిని తెలుసుకొని సంబంధిత శాఖల అధికారులకు ముందుగా తెలియజేయాలన్నారు.జిల్లాలోని 20 మంది జిల్లా అధికారులను ఎంపిక చేసి పరిశ్రమలు వేగంగా నెలకొల్పుటకు ప్రత్యేక అధికారులుగా నియమించాలన్నారు. అలాగే 2 సంవత్సరాలు దాటినప్పటికీ ఇంకను పరిశ్రమలు నెలకొల్పని వారికి ఎందుకు వాటిని రద్దు పరచకూడదో తెలియజేయాలంటూ నోటీసులు జారీ చేయాలన్నారు. ఏపీఐఐసీ పేరు మీద భూములు ఉంటేనే మ్యుటేషన్ చేయడానికి వీలుంటుందని స్పష్టం చేస్తూ మ్యుటేషన్ జాబితా సిద్ధం చేసి ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలన్నారు. ఇదివరకే మ్యుటేషన్ చేసి కూడా 22 ఏ జాబితాలో ఉంటే అటువంటి భూముల జాబితా సిద్ధం చేసి 22 ఏ జాబితా నుండి తొలగింపుకు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒక ఎస్ఎంఈ పార్క్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ద్వారా ర్యాంపు పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేస్తూ వ్యాపారం పెంచేందుకు సరైన మార్గ నిర్దేశం చేసే కన్సల్టెంట్లను గుర్తించాలన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన పీఎంఈజీపి, పీఎం ఎఫ్ ఎం ఈ పథకాల అమలులో పురోగతి సరిగా లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. పిఎం ఎఫ్ఎంఈ పథకం కింద బ్యాంకులలో 39 దరఖాస్తులు ఎటువంటి పురోగతి లేకుండా పెండింగ్లో ఉన్నాయన్నారు. వాటిని వెంటనే పరిష్కరించి రుణాలు మంజూరు చేయాలన్నారు. కేవలం బ్యాంకు రుణాలు తీసుకొని వ్యాపారం చేయని వారికి సిఫారసు చేయరాదని, నిజంగా వ్యాపారం చేయాలని ఆసక్తి, తపనపడే వారిని గుర్తించి ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డిఓ లు స్వాతి, జీ.బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, డి ఆర్ డి ఏ, డ్వామా, మెప్మా పిడీలు శివప్రసాద్, హరిహరనాథ్, సాయిబాబు, జడ్పీ డిప్యూటీ సీఎం ఆనంద్ కుమార్, జిల్లా పశుసంవర్ధక అధికారి చిన్న నరసింహులు, డీఐసీ జీఎం ఆర్ వెంకటరావు, ఏపీఐఐసీ జడ్ ఎం బాబ్జి, జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి షాహిద్ బాబు, ఎల్డీఎం రవీంద్రారెడ్డి, మార్కెటింగ్ ఎడి నిత్యానందం, మార్క్ఫెడ్ డి ఎం మురళీకృష్ణ, తదితర అధికారులు పాల్గొన్నారు.

## మత సామరస్యం మన విధానం

**- కెయూ రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు**
**- వర్సిటీ లో సెమీ క్రిస్మస్ వేడుకలు**




**మచిలీపట్నం డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చెడును పారదోలి మంచిని ఆహ్వానించడమే క్రిస్మస్ పండుగ సందేశం అని కృష్ణా విశ్వవిద్యాలయం రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం కృష్ణా విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యములో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. మన దేశంలోనీ ఈశాన్య రాష్ట్రాల్లో క్రిస్మస్ వేడుకలు అధికారికంగా నిర్వహించడం జరుగుతోందని, ఇప్పుడు అదే విధంగా మన రాష్ట్రంలో కూడా నిర్వహించడం అనవాయితీగా వస్తోందన్నారు. రసాయన శాస్త్ర విభాగం అధిపతి డా. సుజాత, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డా. సుశీల, సహాయ ఆచార్యులు డా. అనిల్ తదితరులు ప్రసంగించారు. తొలుత రెక్టర్ ఆచార్య ఎంవి బసవేశ్వరరావు కేక్ కట్ చేశారు. అనంతరం విద్యార్థులు పాటలు, నృత్యాలు, క్రిస్మస్ సందేశం ఇచ్చేలా నాటకం ప్రదర్శించారు.

# దిగజారుతున్న మానవీయ విలువలు

**మచిలీపట్నం డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం నగరం ఈడేపల్లికి చెందిన శివపార్వతి అనే మహిళ ఇంట్లో నిద్రిస్తున్న అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హఠాత్తుగా ఇంటిలోకి ప్రవేశించి నిద్రిస్తున్న వ్యక్తి కంట్లో కారం కొట్టి దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. మహిళపై దాడి పథకం ప్రకారం మా?
యాదృచ్ఛిమా? దాడికి గల కారణం ఏమిటి? ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన స్థానికంగా సంచలనం సృష్టించింది. మహిళపై గుర్తుతెలియని వ్యక్తి కంట్లో కారం కొట్టి దాడికి పాల్పడ్డాడు. బంధువులు గాయాలుపాలైన ఆమెను మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. ఈ ఘటనపై చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసుల విచారణలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయి. దాడికి పాల్పడిన విధానం చూసి చుట్టుపక్కల స్థానికులు ఆశ్చర్యపోయారు. సమాజంలో నేర ప్రవృత్తి పెరిగి మానవత్వం మంట కలిసి పోతోంది. బంధానికి, బంధుత్వాలకి విలువ లేకుండా పోయింది అని చెప్పడానికి ఈ ఘటనే ఒక ఉదాహరణ కావచ్చు. శివ పార్వతి మచిలీపట్నం ఈడేపల్లిలోని తన కొడుకు, కోడలు తో కలిసి ఉంటోంది. తన కుమారుడు మచిలీపట్నం లోనీ ఓ పెట్రోల్ బంకులో ఉద్యోగం చేస్తున్నాడు. పెట్రోల్ బంక్ యాజమాన్యం ఇటీవల అతనికి నైట్ డ్యూటీ వేశారు. కోడలు, గృహిణి. మనవడు, మనవరాలు చిన్నపిల్లల కావడంతో చదువుకుంటున్నారు. భర్త మరణించడంతో ఆమె కొన్ని సంవత్సరాల నుండి తన కొడుకు, కోడలు వద్ద ఉంటూ వారి బాగోగులు చూసుకుంటుంది. ఆమె ఓ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులకు వంట పనిచేస్తోంది. హ్యాపీ గా సాగిపోతున్న ఈమె లైఫ్ లో డిసెంబర్ 14వ తేదీ అర్ధరాత్రి ఒక అనుకోని సంఘటన చోటుచేసుకుంది. ప్రతిరోజు లాగానే కుమారుడు నైట్ డ్యూటీ కి వెళ్ళడం, కోడలు పిల్లలతో పక్క గది పడుకున్నాక ఆమె నిద్రపోతుంది.. ఆదివారం అర్ధరాత్రి కావడంతో రోడ్డు నిర్మానుష్యంగా ఉంది. చల్లని గాలులు హోరుతో నిశ్శబ్దంగా ఉంది. ఎటు చూసినా చీకటి. అక్కడక్కడ మాత్రం వీధి దీపాలు వెలుగుతున్నాయి. సుమారు 1 గంటల సమయంలో ఓ అగాంతకుడు శివపార్వతి ఇంటిలోకి ప్రవేశించి విచక్షణ రహితంగా పార్వతి పై దాడి చేయడం మొదలుపెట్టాడు. కంట్లో కారం కొట్టి మరీ దాడి చేశాడు. ఇతను ఎందుకు దాడి చేస్తున్నాడో బాధితురాలికి అర్థం కాలేదు. గట్టిగా కేకలు పెట్టినా ఎవరు రాలేదు. పక్క గదిలో నిద్రిస్తున్న కోడల కి తన కేకలు వినిపిస్తే సహాయం చేస్తుందని భావించి పార్వతి మరింత గట్టిగా అరిచింది. అరుపులు బయటకు వినిపించకుండా అగంతకుడు జాగ్రత్త పడ్డాడు. ఇంతలో ఆమె కోడలు నిద్ర లేచింది హమ్మయ్య నా కోడలు నిద్ర లేచింది నన్ను కాపాడుతుందని భావించి చేతులతో సైగ చేయడం మొదలు పెట్టింది. నిద్రలేచిన కోడలు అత్త వద్దకు వచ్చి కంటిలో కారం కొట్టింది. అప్పుడు కానీ అత్తకు అర్థం కాలేదు. కోడలు, గుర్తుతెలియని అగంతకుడు కలిసి తననూ హత్య చేయాలని పథకం వేసి కుట్ర పన్నారని అపుడు అర్థమైంది. వేరే వ్యక్తి తో అక్రమ సంబంధం పెట్టుకున్న కోడలు తనకు అడ్డుగా ఉన్న అత్త ను అడ్డు తొలగించుకోవడానికి ప్రియుడుతో కలిసి హత్య చేయడానికి పథకం రచించింది. పథకం ప్రకారం భర్త పెట్రోల్ బంకుకూ వెళ్లాక, ప్రియుడితో కలిసి కోడలు అత్తపై దాడి చేశారు. ఈ నేపథ్యంలో శివపార్వతి స్పృహ కోల్పోవడంతో కంగారులో చనిపోయిందని భావించి కోడలు అగాంతకుడుతో పరారై వెళ్లిపోయింది. స్పృహ వచ్చాక జరిగిందంతా తన ఇంటి పక్కనే ఉన్న మరిదికి వివరించింది. వెంటనే ఆమెను వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. జరిగిన ఉదాంతాన్ని వివరిస్తూ చిలకలపూడి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు పై కేసు నమోదు చేసి, నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అక్రమ సంబంధంతో మానవ సంబంధాలు మంట కలిసిపోతున్నాయి అనడానికి ఈ ఘటన ఒక ఉదాహరణ

## గ్రామీణ విద్యార్థులపై దృష్టి పెట్టిన యంఎన్ఆర్ ఫౌండేషన్



**రెడ్డిగూడెం డిసెంబర్ 19(వార్తాప్రభ ప్రతినిధి):** గ్రామీణ ప్రాంత విద్యార్థులు విద్యలో ముందుకు సాగాలనే లక్ష్యంతో యంఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మద్దులపర్వ ఎపి మోడల్ స్కూల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముప్పిడి నాగేశ్వర రెడ్డి , బొమ్మిన కోటేశ్వరరావు , సోమేశ్వర రావు యుటిఎఫ్ పాధ్యాయులు,యుటిఎఫ్ నాయకులు ప్రకాష్ ,ఎపి మోడల్ స్కూల్ ఇన్చార్జి ప్రిన్సిపాల్ పాల్గొని పదవ తరగతి మరియు ఇంటర్ విద్యార్థులకు మోటివేషన్ క్లాసులు, కెరీర్ గైడెన్స్, అలాగే స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. విద్యార్థుల్లో పరీక్షల భయాన్ని తొలగించి, లక్ష్యం వైపు తీసుకువెళ్లడమే. ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నాగేశ్వర రెడ్డి తెలిపారు. గ్రామీణ విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్ష వ్యక్తం చేశారు. కెరీర్ గైడెన్స్ సెషన్లలో వివిధ విద్యా అవకాశాలు, భవిష్యత్తు లక్ష్యాలపై విద్యార్థులకు స్పష్టమైన అవగాహన కల్పించారు. యుటిఎఫ్ ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోత్సాహకరమైన సూచనలు నాగేశ్వరరెడ్డి అందించారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామీణ విద్యాభివృద్ధిపై యంఎన్ఆర్ ఫౌండేషన్ చూపుతున్న నిబద్ధత మరోసారి స్పష్టమైంది అని విద్యార్థులు, ఉపాధ్యాయులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## యువతతో మమేకమవుతున్న తిరువూరు శాసనసభ్యుడు కొలికపూడి



**విస్సన్నపేట డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక మండల కేంద్రంలో బీజేఆర్ నగర్ లో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు పొద్దు పోయే వరకు యువత మధ్య గడిపారు. త్రాగునీరు డ్రైనేజీ రోడ్లు స్మశాన వాటిక ఎస్సీ కార్పొరేషన్ రుణాలు తదితర సమస్యలు తెలియజేశారు. త్వరితగతన పరిష్కరించేందుకు ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం తిరువూరు నియోజకవర్గ పరిధిలో విసన్నపేట గంపలగూడెం తిరువూరు ఏ కొండూరు మండలంలో 20 కోట్లతో సిసి రోడ్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే తెలియజేశారు, యువతకు ఉపాధి అవకాశాలు అవసరమన్నారు, యువతకు అండగా తాను ఉంటాను అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు ప్రభాకర్, రవీంద్ర,సుధాకర్ స్టాలిన్ మురుగుల ప్రసాద్, గరిమెళ్ళ లోకేశ్వరరావు, వేమన, నవీన్, స్టాలిన్, గిరిజన నాయకుడు కృష్ణ , ముస్లిం నాయకులు సుభాని జనసేన నాయకులు యాసీన్ నందమూరి వెంకటేశ్వర రావు, వీర మహిళ మౌలిక, కొండ,కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# సమిష్టి కృషితో ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేద్దాం

**సబ్ కలెక్టర్ కె చైతన్య**

**వివిధ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన సబ్ కలెక్టర్**





**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ (వార్తా ప్రభ ప్రతినిధి):** ఈ నెల 29, 30, 31, తేదీలలో జరిగే అన్ని శాఖల సమిష్టి కృషితో హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా ఉరుసు మహోత్సవాలను విజయవంతం చేద్దామని తెలిపారు సబ్ కలెక్టర్ కె చైతన్య. శుక్రవారం నాడు ఉరుసు నిర్వహణపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉరుసు నిర్వహణకు కావలసిన మౌలిక సదుపాయాలపై ఉరుసు కమిటీ మరియు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుసు మహోత్సవానికి వచ్చే లక్షలాది భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించవలసిందిగా అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలిగించకుండా పారిశుధ్యం, మంచినీటి సౌకర్యం, శాంతిభద్రతలు, మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఉరుసు కమిటీ సభ్యుల అభిప్రాయాలు, వారి అవసరమైన ఏర్పాట్లు కలెక్టర్ లక్ష్మి శా తీసుకువెళ్లి సహకరిస్తామని తెలిపారు. ఉరుసు మహోత్సవానికి సహకరించవలసిందిగా వీటీపీఎస్ అధికారులను కోరారు. దాతలు కూడా తమ వంతు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ముందుగా దర్గా ప్రాంగణం లో పర్యటించి సౌకర్యాల ఏర్పాట్లను పరిశీలించారు. ఉరుసు కమిటీ చైర్మన్ అల్తాఫ్ బాబా సబ్ కలెక్టర్ మరియు అధికారులను దర్గాలో ఇస్లాం సంప్రదాయ ప్రకారం సన్మానించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యక్షులు సయ్యద్ బాజీ,తాసిల్దార్ వెంకటేశ్వర్లు, సర్కిల్ ఇన్స్పెక్టర్ చంద్రశేఖర్, కమిషనర్ వెంకటరత్నం, ఏఈ మౌస్మి గనియా, ఎన్టిపిఎస్ అధికారులు, టిడిపి రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ ఫైజాన్, కో ఆప్షన్ సభ్యులు షేక్ మహబూబ్ సుభాని, బాలాజీ, దర్గా ముజావర్లు స్థానిక టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# బి.ఐ.ఎస్.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్

**సరికొత్త ఇంటరాక్టివ్ మాధ్యమాలు**





**నూజివీడు: డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నూజివీడు బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ పాఠశాలలో (బి ఐ ఎస్) విద్యార్థుల భవిష్యత్తు కోసంమరో సాంకేతిక పరిజ్ఞానం కోసం మరో అడుగు వేసింది. పాఠశాల యాజమాన్యం శ్యాం బండి, హదస్సా బండి, 'క్రిసాలిస్' వ్యవస్థాపకులు చిత్ర రవి తదితరులతో సమావేశమై, 2026 - 2027 విద్యా సంవత్సరానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. దీనిలో భాగంగా విద్యార్థుల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), సరికొత్త ఇంటరాక్టివ్ మాధ్యమాలు, ఏఐ స్పీచ్ డెవలప్మెంట్ ఇంటర్ఫేస్' వంటి అధునాతన సాంకేతికతను పాఠశాలలో ప్రవేశపెట్టనున్నారు. ఈ వినూత్న విద్యా విధానాలను అమలు చేసే దిశగా శుక్రవారం అగిరిపల్లి, నూజివీడు శాఖలకు చెందిన ఉపాధ్యాయులకు 'క్రిసాలిస్' సంస్థ ఆధ్వర్యంలో ' ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్' (ఏ 1అనుసంధాన శిక్షణ) నిర్వహించారు. ఈ శిక్షణ ద్వారా ఉపాధ్యాయులు సరికొత్త సాంకేతికతను బోధనలో ఎలా ఉపయోగించాలో అవగాహన పొందారు. ఇటువంటి అధునాతన మార్పులను కేవలం కొన్ని నిర్ణీత పాఠశాలలతో జతకట్టి ఈ నూతన విద్యా సంవత్సరంలో ప్రారంభించనున్నారు. నేడు ప్రపంచవ్యాప్తంగా విద్యా మరియు వృత్తిపరమైన రంగాలలో ఏఐ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ క్రమంలో అనేక అంతర్జాతీయ విద్యా పోటీదారుల కంటే మెరుగైన రీతిలో క్రిసాలిస్ ఈ నూతన మార్పులను తీసుకువచ్చింది. ముఖ్యంగా ఈ ఏఐ స్పీచ్ డెవలప్మెంట్ ఇంటర్ఫేస్ ప్రతి విద్యార్థి యొక్క అభివృద్ధి దశలను గమనిస్తూ, వారికి వివరణాత్మక ఫీడ్బ్యాక్ను అందిస్తుంది. కేవలం ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంతో మాత్రమే సాధ్యం కాని స్థాయి పురోగతిని ఈ సాంకేతికత ద్వారా విద్యార్థులు సాధించవచ్చని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. సాధారణ పాఠశాలలు, ఇంకా ప్రాథమిక విద్యా విధానాల్లోనే ఉన్నప్పటికీ, బి. ఐ.ఎస్. మాత్రం సాంప్రదాయ పద్ధతులను దాటి తన విద్యార్థులను ఏ 1 ప్రపంచానికి సిద్ధం చేస్తోంది. భాషాభివృద్ధి, కొత్త ఆవిష్కరణల పట్ల ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ వహించే బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఈ ఏఐ ప్రాజెక్ట్ ద్వారా విద్యార్థుల భవిష్యత్తును అత్యున్నత విజయాల పథంలోకి నడిపించడానికి కృషి చేస్తోంది. పాఠశాలలో చదువుతున్న, చదువుకున్న విద్యార్థులు మానసికంగా, శారీరకంగా దృఢత్వం పొందేందుకు ఇప్పటికే పాఠశాల యాజమాన్యం క్రీడల పట్ల విద్యార్థులను ఆకర్షితులను చేసి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించేలా ప్రోత్సహిస్తున్నారు. ఇప్పుడు ఆధునిక సాంకేతికతను ఎప్పటికప్పుడు విద్యార్థులకు అందిస్తూ చదువుతో పాటు వారిలోని నైపుణ్యాలను వెలికితీసి భవిష్యత్ లో వారు ఉన్నతంగా ఎదిగేందుకు అన్ని విధాలుగా తోడ్పాటు అందిస్తూ, ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడేందుకు అవకాశం కల్పిస్తోంది. నూజివీడులో బిస్ పాఠశాల చదువుల తల్లిగా తన పేరును సార్థకం చేసుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నం చేస్తుందని, ఉపాధ్యాయులు కూడా అందుకు సహకరిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని యాజమాన్యం సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## గోవాడ బాల కోటేశ్వర స్వామి సన్నిధిలోలో కోటికుంకుమార్చన

**సాముహిక లలితా సహస్రనామ పారాయణము**





**చెరుకుపల్లి మండలం డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పవిత్ర మార్గశిర మాస అమావాస్య శుక్రవారం పురస్కరించుకొని శ్రీ పార్వతీ సమేత బాలకేటేశ్వర స్వామి దేవాలయం గోవాడ లో సాముహిక లలితా సహస్రనామ పూజ, కోటి కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ శ్రీనివాసశర్మ, చావలి శ్రీధర్ శర్మ స్వామివారికి అభిషేకాలు పార్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజ పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్గశిర మాస అమావాస్య శుక్రవారం రావడం మనందరి అదృష్టం శుక్రవారం అమ్మవారికి పూజ చేయడం వలన సకల శుభాలు కలుగుతాయన్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే ఆ జగన్మాత పరాశక్తి పరమేశ్వరి యొక్క నామాలను సహస్రనామాలు గా ఇంతమంది మహిళలు ఈ క్షేత్రంలో పారాయణ చేయడం మనకు శక్తి లభిస్తుందన్నారు. లలితా సహస్రనామ పారాయణం చేయటం సకల శుభప్రదమన్నారు. మైత్రేయి ఆశ్రమ నిర్వాహకురాలు గంటా నిర్మలమ్మ భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పావులూరి రమేష్, ఆలయ కార్యనిర్వహణాధికారి మంతెన విటల్ శ్రీనివాస్ వర్మ, పావులూరి సుబ్బారావు,పొన్నపల్లి సత్యనారాయణ జంజనం హేమ శంకరరావు. ఉప్పల పద్మజ, చింతల మురళీకృష్ణ,పడమట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## విధులను అంకితభావంతో నిర్వహించాలి- జిల్లా కలెక్టరు



**మచిలీపట్నం డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విధులను అంకితభావంతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి కొత్తగా నియమితులైన ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ నగరంలోని వారి చాంబర్లో 15 మందికి కారుణ్య నియామకాల కింద నియామక పత్రాలు అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో 9 మంది జూనియర్ అసిస్టెంట్ పదవులకు, 6 మంది ఆఫీస్ సబార్డినేట్ పదవులకు వివిధ ప్రభుత్వ శాఖలకు కేటాయిస్తూ జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వారికి అప్పగించిన పనులను సజావుగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ యం నవీన్, డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కలెక్టరేట్ ఏవో రాధిక తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇంధన పొదుపు సామాజిక బాధ్యత




**ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రతి పౌరుడు ఇంధన పొదుపు తమ సామాజిక బాధ్యతగా భావించాలని డాక్టర్ ఎన్టిటిపిఎస్ఎన్ .వెంకట్రావు తెలిపారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా స్థానిక డాక్టర్ జాకీర్ హుస్సేన్ కళాశాల ఆవరణలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకట్రావు మాట్లాడుతూ సహజ వనరులు వినియోగం పెరిగి క్రమేణ అవి తరిగిపోతున్నాయి అన్నారు .భవిష్యత్తు అవసరాల కోసం పొదుపుగా వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు .ఇంధన పొదుపు ద్వారా పర్యావరణ పరిరక్షణ ,కాలుష్య నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జాఫర్ సాదిక్ మాట్లాడుతూ ప్రత్యామ్నాయంగా సౌరశక్తి ,వాయు శక్తి వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు .మనము గది నుండి బయటకు వచ్చినప్పుడు అన్ని స్విచ్లు ఆపివేయాలి అన్నారు. ఫ్యాక్టరీ మేనేజర్ బి. హరి మాట్లాడుతూ ప్రజల్లో ఇంధన పొదుపు అవగాహనలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన ,వ్యక్తిత్వ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామన్నారు .అనంతరం ఇంధన పొదుపు ,పర్యావరణ పరిరక్షణ కోసం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇంకా ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ జాన్సన్ ,అధ్యాపకులు మస్తాన్ వలి, సి. హెచ్ రత్నకుమారి ,జ్యోతి ,బేగ్ ,రాము, కృష్ణ ,అనిల్, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

## రేపు పల్స్పోలియోను జయప్రదం చేయండి...



**గుడ్లవల్లేరు:డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గుడ్లవల్లేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో డిసెంబర్ 21 వ తేదీన అనగా ఆదివారం పల్స్పోలియో జరగనుందని ఆ పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఎం.యశస్విని శుక్రవారం తెలిపారు. పల్స్పోలియోను తమ పీహెచ్సీ పరిధిలోని 17కేంద్రాలతో పాటు ఒక మొబైల్ టీమ్ ద్వారా 2,022మంది 0%-%5సంవత్సరాల వయసు కలిగిన చిన్నారులకు పోలియో చుక్కలను వేయనున్నట్లు చెప్పారు. 22, 23వ తేదీలలో ఇంటి ఇంటికి తిరిగి మిగిలిన పిల్లలకు చుక్కలు వేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు డాక్టర్ టి.ప్రవీణ, సూపర్ వైజర్స్, ఏఎన్ఎమ్లు, ఎమ్ఎల్హెచ్పీలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొంటారని తెలియజేశారు.

# బడి బయట బాలికను బడిలో చేర్పించిన ఎంఈఓ రవీందర్




పెనుగంచిప్రోలు, డిశంబర్ 19(వార్త ప్రభ) బడికి వెళ్లకుండా పెనుగంచిప్రోలు తిరుపతమ్మ అమ్మవారి గుడి వద్ద సంచరిస్తున్న బాలికను ఎంఈఓ రవీందర్ శుక్రవారం నాడు బడిలో చేర్పించారు. బడి బయట బాలికల కోసం తన సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమాన్ని రవీందర్ నిర్వహిస్తుండగా , ఆలయ పరిసరాలలో సంచరిస్తున్న గంధసిరి లక్ష్మీతిరుపతమ్మ అను బాలిక కనిపించింది. వెంటనే బాలిక తల్లికి కౌన్సిలింగు ఇచ్చి, స్థానిక స్వామి పుల్లయ్య మెమోరియల్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం నక్కా బాబురావుతో మాట్లాడి బాలికలను పాఠశాలలో చేర్పించారు. పిల్లలను బడికి పంపకుండా పనులు చేయించడం నేరమని ఈ సందర్భంగా ఎంఈఓ అన్నారు. ఈ కార్యక్రమంలో తన వెంట సిఆర్పి సాంబ ఉన్నారు.

## ఆపన్న హస్తంతో ఆటో అందించి..

- గౌరవ సీఎం హామీతో ఆటో డ్రైవర్ కుటుంబంలో వెలుగులు
- బంగారు కుటుంబానికి పీ4 మార్గదర్శుల చేయూత



విజయవాడ, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)పేదలు అన్ని విధాలా ఎదిగేలా చేయూతనిచ్చేందుకు రాష్ట్రంలో ఓ యజ్ఞంలా అమలవుతున్న పీ4 కార్యక్రమంతో ఓ బంగారు కుటుంబంలో కొత్త వెలుగులు వచ్చాయి. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ప్రారంభోత్సవం సమయంలో గౌరవ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు తాడేపల్లి పరిధిలోని సీతానగరంలో ఉంటున్న పఠాన్ అఫ్సర్ ఖాన్ బంగారు కుటుంబానికి మార్గదర్శి అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ రూ. 3.30 లక్షల విలువైన ఎలక్ట్రిక్ ఆటోను సమకూర్చి సుస్థిర జీవనోపాధికి చేయూతనందించింది. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. మార్గదర్శులతో కలిసి కలెక్టరేట్‌లో లబ్ధిదారుకు ఆటో తాళాలు అందజేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లో విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌లో ఆటో డ్రైవర్ల సేవలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గౌరవ సీఎం.. అఫ్సర్ ఖాన్ ఆటోలో ప్రకాశం బ్యారేజీ మీదుగా ప్రయాణించి అజిత్‌సింగ్ నగర్ చేరుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి అఫ్సర్ ఖాన్ కుటుంబ స్థితిగతులను, క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. పిల్లలు ఏం చదువుతున్నారు, ఆటో నడపడం ద్వారా రోజుకు ఎంత వస్తుంది.. ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా? అని అడగ్గా.. తనకు ఇద్దరు కుమారులు ఉన్నారని.. ఒక అబ్బాయి ఇంజనీరింగ్, మరో అబ్బాయి ఇంటర్ చదువుతున్నాడని, భార్య కుట్టుమిషన్ పని చేస్తోందన్నారు. ఆటో నడపటం ద్వారా రోజుకు రూ. 900 వరకు వస్తోందని, అయితే ఆటో పాతది అయిపోవడంతో రిపేర్లకే ఎక్కువ మొత్తం ఖర్చవుతోందని వివరించారు. దీంతో గౌరవ సీఎం తప్పకుండా చేయూతనందిస్తామని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఎదగాలని సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చొరవతో అఫ్సర్ ఖాన్‌కు అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్ (జగ్గయ్యపేట) సహకారంతో శుక్రవారం కలెక్టేట్ లో ఆటోను అందజేశారు.

**ఈ సాయం మరువలేనిది: అఫ్సర్ ఖాన్** పీ4 కార్యక్రమం ద్వారా ఆటో అందుకోవడం చాలా ఆనందంగా ఉందని.. ఒక రోజు కలెక్టర్ గారు ఫోన్ చేసి వెంటనే కలవమని చెప్పారు. కలెక్టర్ గారిని కలవగానే మా కుటుంబ సభ్యులను కూర్చోపెట్టి మాట్లాడి గౌరవ ముఖ్యమంత్రి గారు ఇచ్చిన హామీ ప్రకారం కొత్త ఆటో సమకూర్చుతున్నట్లు చెప్పారు. పీ4 కార్యక్రమం ద్వారా అల్ట్రాటెక్ సిమెంట్ సంస్థ నుండి ఆటో ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు లబ్ధిదారు అఫ్సర్ ఖాన్ అన్నారు. ఈ చేయూత ఎన్నటికీ మరువలేనిదని పేర్కొన్నారు. ఈ సహకారంతో పీ4 కార్యక్రమ స్ఫూర్తితో కుటుంబాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకుంటానని, సమాజ అభివృద్ధిలో తాను కూడా భాగస్వామిని అవుతానని అన్నారు. కార్యక్రమంలో అల్ట్రాటెక్ సిమెంట్ లిమిటెడ్, బాలాజీ సిమెంట్ వర్క్స్ యూనిట్ హెడ్ శివరాజ్ వరదరాజన్, యూనిట్ హెచ్ఆర్ హెడ్ జి.మోహన్‌రావు, లైజన్ హెడ్ డి.జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు కు బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డ్ రావడం గర్వకారణం

*అవార్డు ముఖ్యమంత్రి కే కాకుండా, రాష్ట్ర ప్రజలందరికీ దక్కిన గౌరవం*

*- రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ దేశ ఆర్థిక అభివృద్ధి కి కీలక కేంద్రంగా మారుతుంది*

*- సీఎం చంద్రబాబు సంస్కరణలు, వేగం, విశ్వాసం అనే సూత్రాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్నారు*

*- షేక్. అబ్దుల్ అజీజ్, ఏపీ వక్ఫ్ బోర్డ్ చైర్మన్.*



విజయవాడ, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు కు ఎకనమిక్ టైమ్స్ సంస్థ ప్రకటించిన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని ఏపీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ పేర్కొన్నారు. పాలనలో సంస్కరణలను ధైర్యంగా అమలు చేస్తూ, వ్యాపార సౌలభ్యాలు, పెట్టుబడుల ఆకర్షణ, ఆర్థికాభివృద్ధిలో ఏపీ స్పష్టమైన దిశను నిర్దేశించిన నాయకుడిగా సీఎం చంద్రబాబు ను జ్యూరీ ప్రశంసించిందని పేర్కొన్నారు. సంస్కరణలు, వేగం, విశ్వాసం అనే సూత్రాలతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న చంద్రబాబు నాయకత్వానికి దేశవ్యాప్తంగా గుర్తింపు లభించడం రాష్ట్రానికి లభించిన విశేష గౌరవమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల అభివృద్ధిలో, పెట్టుబడుల ఆకర్షణలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. ఈ అవార్డు ముఖ్యమంత్రికే కాకుండా, రాష్ట్ర ప్రజలందరికీ దక్కిన గౌరవమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ దేశ ఆర్థిక అభివృద్ధి కి కీలక కేంద్రంగా మారుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# ప్రార్థన చేసే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న

- అమ్మానాన్న లేని వారు కాదు అనాధలు నిజమైన ప్రేమ దొరకని వారే అనాధలు
- డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రనాయక్




దంతాలపల్లి డిసెంబర్ 19 (వార్తా ప్రభ) అమ్మానాన్న లేని వారు కాదు అనాధలు నిజమైన ప్రేమ దొరకని వారే అనాధలు అని డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రు నాయక్ అన్నారు. శుక్రవారంజానవికాస ఆధ్వర్యంలో దంతాలపల్లి మండలంలోని వెంకటేశ్వర గార్డెన్స్ లో 1500 మంది మహిళ లు 30 మంది గ్రామ సర్పంచులు గ్రామ సర్పంచ్లు 25 మంది దాతలు డోర్నకల్ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ దాతలు ఇల్లు శ్రీనివాసరెడ్డి వీరబోయిన సుధాకర్ గారు 30మంది వికాస పిల్లలు జన్మదిన వేడుకలలో పిల్లలను ప్రోత్సహించే విధంగా అందరూ మాట్లాడడం ప్రజాప్రతినిధులు ఆత్మవిశ్వాసం అవగాహన పిల్లల్లో మనోధైర్యాన్ని పెంచడం గమనార్హం బాలవికాస వ్యవస్థాపకురాలు బాల తెరిస్సాను ప్రతి ఒక్కరూ కొనియాడారు బాలమ్మ చేసే సేవలు అమోఘం అదు తేం అందులో మనం ఉండడం అద ృష్టం అని అన్నారు. శాసనసభ్యులు బాలక్కను కొనియాడుతూ బాలవికాను ఇంకా విస్తరింప చేయాలని అన్నారు. పిల్లలతో కేక్ కట్ చేపించే వారికి కొత్త బట్టలు నిత్యవసర వస్తువులు ఇవ్వడం జరిగింది నిత్యవసర వస్తువులు ఇవ్వడం జరిగింది బాలవికాస మేనేజర్ లతా ప్రతాప్ మాట్లాడుతూ పిల్లల్లో ఆత్మ స్థాయిలో మహిళల్లో తలబలం గుణబలం ధైర్యబలాలను పెంచుతూ గ్రామాలలో వాటర్ ప్లాంట్ లో చెరువు కూడికలు బోర్ వెల్స్ విద్యా వికాస పథకం రైతు వికాస లీడర్లకు మహిళలకు గ్రామాభివ ృద్ధి కమిటీలకు శిక్షణలో ఇవ్వబడుతున్నాయని అన్నారు వికాస పిల్లల జన్మ దిన వేడుకలలో ఏఎంసీ చైర్మన్ బట్టు నాయక్ దంతాలపల్లి గ్రామ సర్పంచ్ బాలాజీ గారు దొనకొండ సర్పంచ్ శ్రావణి సురేషు వీరిశెట్టి గూడెం సర్పంచ్ జెట్టి మహేశ్వరి ఆజా చంద్రశేఖర్ రామానుజపురం అక్కిరెడ్డి దామోదర్ రెడ్డి ఆగపేట కొత్త యాకయ్య ముంగిమడుగు దొంత శారద రామన్నగూడెం దారెల్లి రాధిక రామవరం దైవ సుమలతపడమటి గూడెం జక్కుల ఉప్పలయ్య రేపోనే జయరాజ్ పెద్దనాగారం మందుల రఘు తూర్పు తండా పోటియా నాయక్ నరసింహుల పేట పెదమాముల యాకయ్య బొడ్లాడా వెంకన్న దాతలు ఇల్లు ఇల్లు శ్రీనివాసరెడ్డిఎల్లు శ్రీనివాసరెడ్డి కొత్త అంతయ్య మెడికేర్ హాస్పిటల్రేణుక యాజమాన్యం తూర్పాటి రాములు కుమ్మరి కుంట్ల తండా చిన్న రాములు పెద్ద ముప్పారం భరత్ బాబు జయపురం సతీష్ సతీష్ రేణుక అశోక్ రెడ్డి రేణుక అశోక్ రెడ్డి బాలవికాస కోఆర్డినేటర్ అమూల్య దంతాలపల్లి సెంటర్ మేనేజర్ కందునూరి సుకన్య శోభారాణి మార్గం శోభారాణి ఎంసీ స్వర్ణలత గుగ్గిళ్ళ స్వరూపారాణిస్వరూపారాణి చిలకమర్రి యాక లక్ష్మి ఎల్లు రమ ఏకశిలా పెద్ద ముప్పారం స్కూల్ పిల్లలు మహిళలు వికాస పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# వంశీ పై 18 నెలలు తరువాత కేసు పెట్టటం కక్షసాధింపు చర్యే

### ప్రజలు ఖండించాలని కోరిన గన్నవరం జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి



గన్నవరం, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేయటం గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ పై మరొకసారి కక్షసాధింపులో భాగంగా 18 నెలలు క్రితం ఘటన జరిగిందని నిన్నా విజయవాడ మాచవరం పోలీసు స్టేషన్ లో కేసు పెట్టటాన్ని తీవ్రంగా ఖండించాలని ప్రజలను కోరుతున్నట్లు గన్నవరం మండల జెడ్పీటీసీ అన్నవరపు ఎలిజబెత్ రాణి తెలిపారు. ఆమే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అనేక అక్రమ కేసులు పెట్టి వంశీ ని 141 రోజులు కక్షతో జైలులో పెట్టారన్నారు. జైలులో అనేక రకాల ఇబ్బందులు పెట్టిన విషయం ప్రజలకు అందరికి తెలుసు అన్నారు. ప్రస్తుతం వంశీ బెయిల్ పై విడుదల అయిన తరువాత ప్రజలు ప్రతి రోజు ఆయన వద్దకు ఎక్కడ ఉంటే అక్కడకు తండోప తండాలుగా వెళ్ళి వారి సానుభూతిని తెలపటం చూసిన కూటమి ప్రభుత్వంనకు భయంతో మరల వంశీ పై మరొక అక్రమ పెట్టారని ఆమే అన్నారు. వంశీ ప్రజలలోకి వెళ్ళటం టిడిపి పార్టీకి చెందిన ప్రజలు కూడా ఆయన వద్దకు వెళ్ళటం సానుభూతిని తెలపటం టిడిపి పార్టీకి చెందిన నాయకులు జీర్ణించుకోలేని పరిస్థితి వచ్చిందన్నారు. అందువలన 18 నెలలు క్రితం ఘటన జరిగిందని ఇప్పుడు కేసు పెట్టటం వారి భయానికి నిదర్శనం అని ఆమే అన్నారు. ఎన్ని కేసులు పెట్టిన వైఎస్ఆర్ పార్టీకి చెందిన నాయకులు ఎవరు భయ పడరని కూడా ఆమే అన్నారు. ఈ మధ్య గన్నవరం నియోజకవర్గం లో వైఎస్ఆర్ పార్టీ ఇచ్చిన అన్ని కార్యక్రమాలుకు ప్రజలు తండోప తండాలుగా వచ్చారని, అదే రుజువు అని ఆమే అన్నారు. తొందరలోనే ఈ అక్రమ కేసులకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమంలోకి రావాలని ఆమే విజ్ఞప్తి చేస్తున్నా అని ఆమే అన్నారు.

# వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం

- చిన్ననాటి నుంచే సామాజిక సమస్యలపై అవగాహన
- కెరీర్ పరంగా ఉన్నత లక్ష్యాల సాధన దిశగా నడిపించేందుకు ప్రోత్సాహం
- జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించిన కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




విజయవాడ, డిసెంబర్ 19 :(వార్తా ప్రభ ప్రతినిధి)బాల వైజ్ఞానిక ప్రదర్శనలతో విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందుతుందని.. చిన్ననాటి నుంచే సామాజిక సమస్యలపై అవగాహన ఏర్పడి, వాటికి శాస్త్రీయ పరిష్కారాలకు సంబంధించిన ఆవిష్కరణలకు వీలవుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. శుక్రవారం కలెక్టర్ లక్ష్మీశ.. ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్, విద్యాశాఖ అధికారులతో కలిసి గుణదలలోని సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జిల్లాస్థాయి రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనను ప్రారంభించారు. స్టెమ్ ఫర్ వికసిత్ అండ్ ఆత్మనిర్భర్ భారత్ ఇతివృత్తంతో పాటు సుస్థిర వ్యవసాయం, వ్యర్థాల నిర్వహణ, హరిత ఇంధనం, భవిష్యత్తు సాంకేతికతలు, గణిత వినోదం, ఆరోగ్యం, జల వనరుల నిర్వహణ, సంరక్షణ ఉప ఇతివృత్తాలతో నిర్వహించిన కార్యక్రమంలో 169 ప్రాజెక్టులను విద్యార్థులు ప్రదర్శించారు. వ్యక్తిగత, బృంద, ఉపాధ్యాయ కేటగిరీల్లో నిర్వహించిన ప్రదర్శనలో గెలుపొందిన ప్రాజెక్టులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేయడం జరుగుతుంది. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక, సమస్య పరిష్కార ఆలోచనా సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఇలాంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. తరగతి గదిలో నేర్చుకున్న పరిజ్ఞానానికి ప్రాక్టికల్ నైపుణ్యాలు జోడించడం ద్వారా నవ ఆవిష్కరణలు వస్తాయన్నారు. ప్రతి విద్యార్థికి ఉన్న ప్రత్యేక నైపుణ్యాలను గుర్తించి, వాటిని ప్రోత్సహించేందుకు వీలవుతుందన్నారు. కెరీర్‌లో ఉన్నతంగా ఎదిగేందుకు స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని చేరుకునేందుకు ప్రభుత్వం చేయూతనిస్తోందని.. ఇందుకు గౌరవ ముఖ్యమంత్రికి, మంత్రివర్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. నేడు మనం ఉపయోగిస్తున్న మొబైల్‌కు సంబంధించి ఏడు నోబెల్ ఆవిష్కరణలు ఉన్నాయంటే సైన్స్ శక్తి సామర్థ్యం ఏంటో తెలుస్తోందన్నారు. టీమ్ ఎన్‌టీఆర్ సమష్టి కృషితో విజ్ఞానంతో పాటు అన్ని రంగాల్లోనూ నెం.1గా నిలిచేందుకు కృషి చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కుమ్మరి శాలివాహన వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.ఈశ్వర్ మాట్లాడుతూ ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో భాగస్వాములైన ప్రతి విద్యార్థీ విజేతేనని, సమగ్ర అభివృద్ధిలో కీలకపాత్ర పోషించే శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈవో ఎల్.చంద్రకళ, పాఠశాల కరస్పాండెంట్ ఫాదర్ వరప్రసాద్, హెచ్‌ఎం సిస్టర్ షైనీ థామస్, పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ రాంబాబు, జిల్లా సైన్స్ అధికారి కె.పిచ్చేశ్వరరావు, డీసీఈబీ సెక్రటరీ ఉమర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

# 5 న శ్రీ తిరుపతమ్మ రంగుల మహోత్సవం..

**.ఎడ్ల బండ్ల రైతు లు పోలీస్ స్టేషన్ లో పేర్లు నమోదు చేసుకొండి.**



పెనుగంచిప్రోలు, డిశంబర్ 19( వార్త ప్రభ ) 5 వ తేదీన గురువారం రాత్రి శ్రీ గోపయ్య స్వామి, శ్రీ తిరుపతమ్మ అమ్మవారు మరియు పరివార దేవతామూర్తులను ఆలయం నుండీ పెనుగంచిప్రోలు రంగుల మండపం వరకు మేళ్ళతాళ్లాలు మంగళ వాయిద్యా ల మధ్య వివిధ దేవాతా మూర్తులు వేషాలు తో కోలాల మధ్య ఉత్సవ ము గురువారం ఉదయం నుండి జరుగుతుంది రంగుల మండపం కు చేరుతుంది, జగ్గయ్యపేట రంగుల మండపం వద్దకు ఎద్దుల బండ్లపై దేవతా మూర్తు లను తీసుకొని వెళ్ళుటకు ఆసక్తి గల పెనుగంచిప్రోలు గ్రామస్తులు మాత్రమే స్థానిక పోలీస్ స్టేషన్ నందు ది.22.12.2025 ఉ.10:00 గంటల నుండి ది.23.12.2025 సాయంత్రం 6:00 గంటల వరకు బండ్లు వున్న రైతు లు పేర్లు నమోదు చేసుకొనవలసినదిగా ఆలయ అధికారులు కోరడమైనది. తదుపరి 24.12.2025 ఉదయం గం.11:00 లకు పెనుగంచిప్రోలు స్టేషన్ నందు తహశీల్దార్, స్టేషన్ హౌస్ ఆఫీసర్, పెనుగంచిప్రోలు, ఫైర్ ఆఫీసర్, జగ్గయ్యపేట, సహాయక ఇంజనీరు- విద్యుత్ శాఖ, పెనుగంచిప్రోలు,దేవస్థానం సిబ్బంది మరియు రైతులు, మీడియా వారి సమక్షంలో నమోదు కాబడిన పేర్ల నుండిలాటరీ ద్వారా ఎంపిక చేయబడును అన్ని బి. మహేశ్వర రెడ్డి ఉప కమీషనరు మరియుకార్యనిర్వహణాధికారి. తెలిపారు.

# ఆర్ కె ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా సెమీ క్రిస్టమస్ వేడుకలు



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19(వార్తా ప్రభ ప్రతినిధి): స్థానిక ఆర్కే కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు వాక్యోపదేశకులుగా క్రైస్ట్ టెంపుల్ విజయవాడ పాస్టర్ డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్ పాల్గొన్నారు. ఈ సందరరేగా పాస్టర్ ఇమాన్యుల్ మాట్లాడుతూ పాపపరిహారణ నిమిత్తం క్రీస్తు జననం జరిగిందని, మానవాళికి సత్యం విలువలు ప్రణాళికాబద్ధంగా తెలియజేసేందుకు దైవమే మంచి రూపేనా భూమ్మీద క్రీస్తు రూపంలో జన్మించారని తెలిపారు. పాపముల ప్రక్షాళన కొరకు తన రక్తాన్ని చిందించారని అన్నారు. కళాశాలలో విద్యను అభ్యర్థిస్తున్న విద్యార్థులు,విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులను మరియు కళాశాల యాజమాన్యం కు క్రీస్తు యొక్క ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కే రామకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల మధ్య భేదాభిప్రాయాలు లేకుండా విలువలతో కూడిన విద్యను అందించడానికి కళాశాల యాజమాన్యం క ృషి చేస్తుందని, అందరితో కలిసి క్రిస్టమస్ పండగ జరుపుకోవడం ఆనందకరంగా ఉందని అన్నారు. డాక్టర్ పాల్ ఇమ్మానుయేల్ ను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కొండపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

**మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ**

**మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్**

**మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం**



ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 19(వార్తా ప్రభ ప్రతినిధి): కొండపల్లి మున్సిపాలిటీ అభివ ృద్ధి క ృషి చేస్తున్నట్లు మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ తెలిపారు. మౌలిక వసతుల కల్పన, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు వెల్లడించారు. శాసనసభ్యుని కార్యాలయంలో కొండపల్లి మున్సిపల్ కౌన్సిలర్లతో ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందరరేగా ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాదు మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. పాలకవర్గం వార్డులలో పర్యటిస్తూ స్ఫూర్తితోదాయ సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే ఇంటింటికీ నీటి కుళాయి పథకం పనులు కూడా ప్రారంభిస్తారన్నారు. రైల్వేస్టేషన్ రోడ్డు అభివ ృద్ధి పనులు కూడా పూర్తి అయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి కూడా నిధుల మంజూరుకు క ృషి చేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం లో శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణం



హనుమాన్ జంక్షన్ , డిసెంబర్ 19(వార్తాప్రభ)హనుమాన్ జంక్షన్ శ్రీ లక్ష్మి వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో ప్రతి నెల నిర్వహించే వేంకటేశ్వర స్వామి ,సత్యన్నారాయణ స్వామి వ్రతాలతో పాటు ఇకనుండి ప్రతి నెల శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తారు. ఈ నెల ఈ రోజు శుక్రవారం దేవాలయ ఫౌండర్ ట్రస్టీ కాకాని అరుణ బాబు ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వైభవంగా నిర్వహింప చేశారు. ఈ సందర్భంగా దేవాలయాన్ని ప్రత్యేకంగా ఆలంకరించారు. కళ్యాణం లో పాల్గొన్న భక్తులకు బోజన ఏర్పాటు చేశారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని దేవాలయ అర్చకులు చక్రావధానుల సీతారామాచార్యులు నిర్వహించారు. ప్రతి నెల పెద్ద ఎత్తున జరిగే ఈ వేంకటేశ్వర కళ్యాణం నెలకొక భక్తుడు స్పాన్సర్ చేస్తూ నిర్వహింప చేస్తారని అర్చకులు చక్రావధానుల సీతారామ చార్యులు తెలిపారు.

# గోపికా గీతం

**(తిరుప్పావై) ధనుర్మాస స్నాన, వ్రత సంకీర్తనం**

**పాశురాం - 4**



"ఆళి మళైక్కణ్ణా! ఒన్డు నీ కైకరవేల్
ఆళియుళ్ పుక్కు ముగందు కొడు ఆర్తేతి
ఊళి ముదల్వనురువమ్ పోల్ మెయ్ కఱుత్తు
పాళియన్ దోళుడై ప్పఱ్బనాబన్ కైయిల్
ఆళిపోల్ మిన్ని వలమ్పురిపోల్ నిన్ఱదిరందు
తాళాదే శార్ఙముదైత్త శరమళై పోల్
వాళ ఉలగినిల్ పెయ్దిడాయ్ నాంగళుమ్
మార్గళి నీరాడ మగిళ్ందేలో రెమ్పావాయ్."

వివరణ: పర్జన్య దేవుని ప్రార్థన – ప్రకృతిలో పరమాత్మ దర్శనం

విశాలమైన సముద్రంలోని నీటినంతా ఆవిరిగా స్వీకరించి, లోకానికి జీవధారగా వర్షాన్ని ప్రసాదించే ఓ ఔదార్యమూర్తివైన పర్జన్య దేవా (వర్ష దేవుడా)!

మేము గొల్లభామలతో కలిసి ఆచరిస్తున్న ఈ పవిత్ర ధనుర్మాస వ్రతానికి నీ సంపూర్ణ సహకారం కావాలి. నీవు ఏమాత్రం దాచుకోకుండా, నీ వద్ద ఉన్న సంపదనంతా ధారపోసి మమ్ములను కరుణించు. నీ రూపం, నీ చర్యలు సాక్షాత్తు ఆ శ్రీమన్నారాయణుని గుర్తుకు తెచ్చేలా ఉండాలి.

ఆండాళ్ తల్లి ఈ పాశురంలో వర్ష దేవుడిని శ్రీమన్నారాయణునితో పోల్చుతూ అద్భుతంగా వర్ణించారు:

**1. శ్రీహరి మేనిఛాయ (మేఘం):**
ఓ మేఘుడా! సముద్ర గర్భంలోకి చొచ్చుకువెళ్లి, నీటిని పూర్తిగా త్రాగి, ఆకాశానికి ఎగబాకిన నీవు... జగత్కారణుడైన ఆ శ్రీమన్నారాయణుని దివ్యమంగళ స్వరూపం వలె నల్లని కాంతిని (శ్యామల వర్ణాన్ని) సంతరించుకోవాలి.

**2. సుదర్శన చక్రం (మెరుపు):**
ఆ పద్మనాభుని విశాలమైన భుజస్కంధాల చెంత, కుడిచేతిలో ప్రకాశించే 'సుదర్శన చక్రం' (ఆళి) ఎంతటి తేజస్సుతో మెరుస్తుందో... నీవు కూడా ఆకాశంలో అంతటి కాంతితో మెరుపులు మెరిపించాలి.

**3. పాంచజన్య శంఖం (గర్జన):**
ఆ స్వామి ఎడమ చేతిలో ఉండే 'పాంచజన్యం' (వలంపురి శంఖం) శత్రువుల గుండెలు అదిరేలా ఎటువంటి గంభీర నాదాన్ని చేస్తుందో... నీవు కూడా దిక్కులు పిక్కటిల్లేలా ఉరుములతో గర్జించాలి.

**4. శార్ఙ ధనుస్సు (వర్షధార):**
ఆ శార్ఙపాణి తన 'శార్ఙము' అనే ధనుస్సు నుండి విడిచిన బాణాల వర్షం (శరవర్షం) శత్రువులపై ఎలా కురుస్తుందో... నీవు కూడా కాలయాపన చేయకుండా, ఈ లోకం సుభిక్షంగా ఉండేలా ధారాపాతంగా వర్షాన్ని కురిపించాలి.

దివ్య పిలుపు – లోక కళ్యాణం
ఓ పర్జన్యుడా! నీ వర్షం కేవలం నేలను తడపడమే కాదు, సమస్త జీవరాశిని ఆనందపరచాలి.
నీవు కురిపించే జలధారలతో నదులు, తటాకాలు నిండి ప్రవహించాలి.
ఆ నీటితో పంటలు పండి, లోకంలో కరువు దూరమై శ్రేయస్సు వెల్లివిరియాలి.
మేము ఈ మార్గశిర మాసంలో (మార్గళి) ఆనందంగా, ఉత్సాహంగా తలస్నానాలు ఆచరించేలా నీ చల్లని కరుణను కురిపించు.
మేము ఆ శ్రీకృష్ణుని ఆరాధించే ఈ పవిత్ర సమయాన్ని, నీ రాకతో మరింత పవిత్రంగా మార్చు. ఇదే మా ప్రార్థన, ఇదే మా వ్రత సంకల్పం!

// ఆండాళ్ తిరువడిగళే శరణం//

**-రచయిత: వై.ఎస్. యాదవ్,**
**చైర్మన్, జై యాదవ్ జై మాధవ్ ట్రస్ట్.**

# ఎల్‌సి ఆఫ్ గుడివాడ ప్రగతి అధ్వర్యంలో ఎస్‌డబ్ల్యుసి చైర్మన్ 'రావి' పుట్టినరోజు వేడుకలు



**గుడివాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** శుక్రవారం ఉదయం మాజీ శాసనసభ్యులు ప్రస్తుత ఏపీ ఎస్‌డబ్ల్యుసి చైర్మన్ రావి వెంకటేశ్వరరావు జన్మదినోత్సవం అడ్వాన్స్ గా ప్రగతి క్లబ్ ఆధ్వర్యంలో కృష్ణవేణి ఆయిల్ మిల్స్ లో పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అధ్యక్షులు మాదల సురేష్ ఆధ్వర్యంలో ప్రగతి కుటుంబ సభ్యులు విచ్చేసి రావికి శాలువాలు ఫ్లవర్ బొకేల తోటి మరియు పూలదండలతో ఘనంగా జన్మదినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు సాధించాలని ఈ సందర్భంగా ప్రగతి సభ్యులు ఆకాంక్షించారు. ఎంత ఉన్నత పదవుల్లో ఉన్న అందరినీ కలుపుకుపోయే మనస్తత్వం ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించే సుగుణం ఆయన సొంతం అటువంటి రావి వెంకటేశ్వం రావు గారికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతోటి నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ప్రగతి సభ్యులందరూ తరపున ప్రగతి అధ్యక్షులు మాదల సురేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పామర్తి కేశవరావు, రామిధేని వేణుబాబు, ఆర్ మురళీధర్ రావు, మహంకాళి వీర శేఖర్, సనగా సుబ్బారావు, వాసే మురళి, దొడ్డి పైడేశ్వరరావు, గజవల్లి బాలకృష్ణ, వర సాయి సుబ్బారావు, పి. నాంచారయ్య, డి సత్యనారాయణ, నారాయణరెడ్డి, నల్లారి శేషగిరిరావు, పోలవరపు శ్రీనివాసరావు మనోజ్ జైన్, చిలుకూరి యుగంధర్, మరీదు రోహిన్, ఉరిటి రామారావు, రావి నవీన్, కట్టా రవీంద్ర, అట్లూరి రాజా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థాన హుండీ లెక్కింపు..

**● మూడు నెలల కాల వ్యవధిలో రూ॥ 3,72,657/- లక్షల ఆదాయం..**



**గుడివాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** స్థానిక మెయిన్ రోడ్‌లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వామివారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం నిర్వహించారు. దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన లెక్కింపులో.. దేవస్థాన ధర్మకర్తల కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని హుండీలో వచ్చిన నగదు లెక్కించారు. మూడు నెలల కాల వ్యవధిలో లెక్కింపు చేపట్టినట్లు దేవస్థాన ధర్మకర్తల కమిటీ చైర్మన్ సాయన రాజేష్ తెలిపారు. అధికారుల సమక్షంలో నేడు నిర్వహించిన హుండీ లెక్కింపులో రూ॥ 3లక్షల 72వేల 657రూపాయల ఆదాయం వచ్చినట్లు రాజేష్ తెలిపారు. కానుకల రూపంలో భక్తుల సమర్పించిన హుండీ ఆదాయాన్ని దేవస్థానం బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ఈవో యార్లగడ్డ వాసు, ధర్మకర్తల మండలి సభ్యులు పోతురాజు, పంచమర్తి శ్రీనివాసరావు, వీరమాచనేని శైలజ, జయలక్ష్మి, దుర్గ భవాని, లోయ వాసు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడలో వాసవి జాగృతి క్లబ్ జోన్ చైర్మన్ స్నేహపూర్వక పర్యటన

**● గుడివాడ శాఖ అధ్యక్షుడు శేగు అధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు..**





**గుడివాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** శుక్రవారం ఉదయం వాసవి జాగృతి క్లబ్ జోన్ చైర్మన్ కొల్లిపర అనసూయ స్నేహపూర్వక పర్యటన ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం ప్రాంగణము నందు వాసవి జాగృతి క్లబ్ గుడివాడ అధ్యక్షులు శేగు వెంకటప్రసాద్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ క్రమంలో కొల్లిపర అనసూయ చేతుల మీదుగా ప్రతినెల అమావాస్య రోజున నిర్వహించే గుప్పెడు బియ్యం కార్యక్రమంలో భాగంగా శ్రీ కన్యా పరమేశ్వరి దేవస్థానం వారికి 26 కేజీలు బియ్యం బస్తాన్ని అందజేయడం జరిగింది అలాగే గోశాలకి 25 కిలోలు దాన బస్తా అందజేయడం జరిగింది అలాగే పదిమందికి దుప్పట్లు లుంగీలు తుళ్ళు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గరపు తిరుపతయ్య డిస్టిక్ కోఆర్డినేటర్ బొగ్గరపు సాయిబాబు మరియొక డిస్టిక్ కోఆర్డినేటర్ శేగు బబిత నేత్రధాన ప్రోత్సాహకులు గాదె మోహన్ బాబు కృష్ణాజిల్లా ఆర్యవైశ్య మహిళా విభాగ్ అధ్యక్షురాలు పోకూరి రాజేశ్వరి క్లబ్ సభ్యులు గోళ్ళ మధులత నారిక మల్లి జయశ్రీ పబ్బిశెట్టి మల్లేశ్వరరావు బచ్చు మురళి బచ్చు ఉమామహేశ్వరావు కొల్లిపర నరసింహారావు క్లబ్ కార్యదర్శి కంతేటి హరినాథ్ బాబు జూపూడి సంపూర్ణమ్మ పెరుమాళ్ళ.. పాబోలు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బాల్యవివాహాలు చట్టరీత్యానేరం



**గుడివాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** గుడివాడ ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని గుడివాడ రూరల్ మండలంలోని చౌటపల్లి హై స్కూల్ నందు బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కిశోరబాలికలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగినది. ముఖ్య అతిధిగా పాల్గొన్న ఐ.సి.డి.యస్. ప్రాజెక్ట్ అధికారిణి ఎం పద్మావతి మాట్లాడుతూ బాల్య వివాహం బాలబాలికల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని, విద్యను దెబ్బ తీస్తాయని సూచించారు. బాల్య వివాహాలను ఎవరూ ప్రోత్సహించరాదని తెలియచేసినారు. ఆడపిల్లలందరూ చక్కగా చదువుకుని వారి కాళ్ళు మీద వారు నిలబడాలి అని కిశోరబాలికలకు సూచించినారు. ఈ కార్యక్రమంలో డిసిపియు సెక్షన్ నుండి ఈ. చంద్రమ్మ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎన్. నాగశిరీష, హైస్కూల్ హెచ్.ఎం. బి. శ్రీలక్ష్మి, అంగన్‌వాడీ వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# ఎప్పటికీ బీ సీ లు నా గుండెల్లోనే : ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** గిద్దలూరు లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీ సీ సంఘ మహిళా ప్రధాన కార్యదర్శి జాడి శ్వేతా మరియు పలువురు బీ సీ నాయకులు, గౌరవ శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి, గిద్దలూరులో బీసీ వర్గాలకు చెందిన ప్రజలు అధిక సంఖ్యలో నివసిస్తున్నారని అయితే, ప్రస్తుతం సామూహిక సమావేశాలు, సంక్షేమ కార్యక్రమాలు, విద్యా అవగాహన కార్యక్రమాలు, శిక్షణ శిబిరాలు నిర్వహించేందుకు సరైన భవనం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే ఈ ప్రాంతంలో బీసీ భవన్ ఏర్పాటు చేయడం బీసీ యువత, విద్యార్థులు, మహిళలు, వృద్ధులకు ఎంతో మేలు జరుగుతుందని అలాగే ఇది ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, సామాజిక ఐక్యతకు కేంద్రంగా నిలుస్తుందని తెలిపారు. అందువలన గౌరవనీయులైన ఎంఎల్‌ఏ గారిని ఈ విషయం పరిగణనలోకి తీసుకొని, బీసీ భవన్ నిర్మాణానికి




అవసరమైన స్థలాన్ని మరియు నిధులు మంజూరు చేసి, తక్షణ చర్యలు తీసుకోవలసిందిగా వినమ్రంగా కోరుతూ వినతి పత్రం సమర్పించారు.

# హైడ్రాలిక్ లిఫ్టింగ్ పంపింగ్ ట్రాక్టర్ ప్రారంభించిన ఎమ్మెల్యే



**తిరువూరు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** తిరువూరు బైపాస్ రోడ్డు హరి ఇంజనీరింగ్ నెల్లూరి రామకృష్ణఆధ్వర్యంలో సులువైన పద్ధతుల వ్యవసాయ పనులు చేయుటకు అధునాతనమైన పరికరాలతో నూతనంగా తయారుచేసిన హైడ్రాలిక్ లిఫ్టింగ్ ట్రాక్టర్ ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే కొలకపూడి శ్రీనివాసరావు స్వయంగా ట్రాక్టర్ అమర్చిన హైడ్రాలిక్ లిఫ్టింగ్ పంపింగ్ పనితీరు పరిశీలించారు ఎమ్మెల్యే

# అవగాహనతోనే బాల్య వివాహాలను నివారించగలం



**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** మద్దాయి కుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఏలూరు జిల్లా వారి ఆధ్వర్యంలో చైల్డ్ లైన్ హెల్ప్ లైన్, లైంగిక వేధింపుల నుంచి బాలల రక్షణ చట్టం (పోక్సో) 2012, బాల్య వివాహాలు నిషేధంపై విద్యార్థిని విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయుల దారపురెడ్డి భాస్కరు రావు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్న బాలలకు 1098 ఫోన్ నెంబర్ 24 గంటలకు అందుబాటులో ఉంటుందని బడి బయట పిల్లలు, బాల్య వివాహాలు, బాల కార్మికులు, అనాధ పిల్లలు అత్యాచారానికి గురైన బాలలు, భిక్షాటన చేస్తున్న బాలల హక్కుల, కోసం పనిచేస్తుందని ఆ సంస్థ ఏలూరు ప్రతినిధి వైవి రాజు విద్యార్థులకు తెలిపారు. సోషల్ వర్కర్స్ సునీత మాట్లాడుతూ బాలలు ఎవరైనా సరే గుడ్ టచ్ బాడ్ టచ్ మరియు నో టచ్ పట్ల అవగాహన ఉండాలని అలాంటి పరిస్థితి ఎదురైతే గట్టిగా అరిచి సమీపంలో ఉన్న పెద్దవాళ్లకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కర రావు మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చేత బాల్య వివాహాలు నిషేధం పట్ల అవగాహన తెలిపే ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు అత్యవసర పరిస్థితికి 108 ఫోన్ నెంబర్కు, పోలీసు శాఖకు 100 ఫోన్ నెంబర్ కు తెలియజేయాలని బహిరంగ ప్రదేశాల్లో కానీ, అసురక్షత ప్రదేశాల్లో గాని మీ శరీర భాగాన్ని ఎవరైనా తాకటానికి ప్రయత్నిస్తే గట్టిగా అరవాలి, బాల్యవివాహాలు వద్దు, మీ గ్రామంలో సమీప ప్రాంతంలో ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతుంటే గ్రామ పెద్దలకు అంగన్వాడీ సిబ్బందికి, పోలీసు సిబ్బందికి తెలియజేయాలని బాగా చదువుకొని ఉన్నత స్థితికి ఎదగాలని సమాజంలో ఎదురయ్యే ఇబ్బందులు పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టిటి భాస్కర్, జై పద్మ, కె నవ్య, యువ శివ నాగరాజు బి జూన్సన్ తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ పోలీస్ స్టేషన్లో అర్జున్ రెడ్డి..




**గుడివాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సమీప బంధువు అర్జున్ రెడ్డి ఓ కేసు నిమిత్తమై గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో విచారణకు హాజరయ్యారు. సుమారు మూడు గంటల పాటు అర్జున్ రెడ్డిని సీఐ హనీష్ విచారణ చేశారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకు నమోదైన కేసులో అర్జున్ రెడ్డికి సోమవారం 41 ఏ నోటీసులు ఇచ్చామని, నేడు ఆయన హాజరు కాగా విచారణ చేసినట్లు సిఐ హనీష్ తెలిపారు. తదుపరి విచారణ కొనసాగుతుందన్నారు.

# ఘనంగా మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పుట్టినరోజు వేడుకలు



**కంకిపాడు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** మండల కేంద్రమైన కంకిపాడులో తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు కంకిపాడు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, కంకిపాడు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోగినేని రమణ పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉయ్యూరు డివిజన్ లెవెల్ విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు తుమ్మలపల్లి హరికృష్ణ, టిడిపి నాయకులు యలమంచిలి కిషోర్ బాబు, సంఘపు రంగారావు, కొనతం సుబ్రమణ్యం, పులి శ్రీనివాసరావు, కొండ నాగేశ్వరరావు, వెంకట్, విక్రమ్, జయ, రాజా, బాజీ ,చిరంజీవి, నాంచారయ్య గోగినేని రమణను శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం అందజేశారు, అనంతరం కేక్ కటింగ్ నిర్వహించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ వాసవీ అధ్యాపకులు ఫణికాంత్ కు డాక్టరేట్ ప్రధానం



**పెడన,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** పెడన మండలం నందమూరు లోని శ్రీ వాసవీ ఇంజనీరింగ్ కళాశాల గణిత అధ్యాపకులు ఎల్ ఎల్ ఫణికాంత్ కు కుప్పం ద్రవిడియన్ యూనివర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది.ఫిక్స్ డ్ పాయింట్ థియరం ఆన్ ఇంట్యూషనిస్టిక్ ఫజ్జి మెటిరిక్ స్పెసెస్ అనే అంశం పై పరిశోధనకు గాను డాక్టరేట్ ప్రదానం చేసినట్టు కళాశాల ప్రిన్సిపాల్ బి ఆర్ ఎస్ రెడ్డి తెలిపారు.ఇది సాఫ్ట్ కంప్యూటింగ్ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వంటి రంగాల్లో ఉపయోగపడుతుంది. కళాశాల చైర్మన్ జి మెహరప్రసాద్ సెక్రటరీ మెహర్ బాబా కరెస్పాండెంట్ కుమారబాబు ఎక్సక్యూటివ్ డైరెక్టర్ బాబా వైస్ ప్రెసిడెంట్ రాజా రమేష్ పోలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

# భక్తి శ్రద్ధలతో సెమీ క్రిస్మస్ వేడుకలు

**● జి.కొండూరు పాస్టర్స్ వెలోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు**





**జి.కొండూరు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలం పాస్టర్స్ వెలోర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కమ్యూనిటీ హాల్ లో గురువారం రాత్రి భక్తిశ్రద్ధల తో క్రైస్తవ సోదరులు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు.మండల వ్యాప్తంగా పలు గ్రామాలు, వివిధ సంఘాల నుంచి పాస్టర్స్ తమ సంఘ సేవకులు,విశ్వాసులతో సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మైలవరం రెవరెండ్ స్టీఫెన్ జార్జ్ , డాక్టర్ టి.ప్రభు కుమార్ రఫా హాస్పిటల్ విజయవాడ దైవజను పాల్గొని ప్రభువైన యేసుక్రీస్తు వాక్యం చేత సేవకులను బలపరిచారు. సమాజంలో క్రైస్తవు లు ఎదుర్కొంటున్న సమస్యలు, క్రైస్తవులకు కళ్యాణ వేదిక లేక పోవడం చాలా ఇబ్బందికరం గా ఉందన్నారు. కొంత స్థలాన్ని జి.కొండూరు ఫెలోషిప్ తరపున కళ్యాణ వేదిక, కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవటానికి 10 సెంట్లు స్థలాన్ని కేటాయించాలని, గ్రామాల్లో 10 నుండి 15 కుటుంబాలతో సేవ చేస్తూ మందిరాలు కట్టుకుంటున్న సేవకులకు గ్రామ సచివాలయం పంచాయతీల ద్వారా పర్మిషన్లు ఇప్పించాలని, క్రైస్తవ స్మశాన వాటిక లకు చుట్టూ ప్రహరీ గోడ లు నిర్మించాలని,చేతి పంపులు తదితర సమస్య ల గురించి ఫెలోషిప్ కమిటీ నాయకులకు, స్థానిక అధికారులకు తెలియపరిచారు. అనంతరం 2026వ సంవత్సరపు నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఇరిగేషన్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అంకెం ఇందిరా ప్రియదర్శిని, రాష్ట్ర వద్దెర వెలోర్ అసోసియేషన్ డైరెక్టర్ జెటిపిటి మహాలక్ష్మి,వేములకొండ వెంకటేశ్వర రావు , వేములకొండ తిరుపతిరావు, వేములకొండ రాంబాబు,అంకెం సురేష్,అంకెం ఇందిరా ప్రియదర్శిని,మైలవరం నియోజకవర్గ తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అంకెం సురేష్,గరికపాటి జైపాల్,ఫెలోషిప్ గౌరవ అధ్యక్షులు ఎన్ అబ్రహం, జి.రమేష్, శామ్యేల్, యు.మోహన్ రావు, వై.నిఖిల్, ఫెలోషిప్ నూతన కమిటీ ప్రెసిడెంట్ ఎన్.మిషక్ బాబు, వైస్ ప్రెసిడెంట్ ఎం.కనకారావు, జనరల్ సెక్రెటరీ ఎ.విజయ్ బాబు, ట్రెజరర్ జి.డానియల్, జాన్ సెక్రెటరీ ఎన్.ఏసుదాసు,కార్యవర్గ సభ్యులు చిరంజీవి,కుమార్,స్టీఫెన్ పాల్గొన్నారు.




# సాయుధ దళాల పతాక నిధికి ఉద్యోగుల సహకారం భేష్





**విజయవాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** దేశ రక్షణలో ప్రాణాలను సైతం పణంగా పెట్టిన వారి త్యాగాలను స్మరించుకుంటూ, వారి కుటుంబాలకు మేమున్నామంటూ మనోధైర్యం కల్పించేందుకు ఉద్దేశించిన సాయుధ దళాల పతాక నిధికి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు తమవంతు సహకారం సమకూర్చడం అభినందనీయమని, ఇందుకు ఉద్యోగులను ప్రోత్సహించిన ఏపీ ఎన్‌జీజీవో అసోసియేషన్ నేతల కృషి ప్రశంసనీయమని గౌరవ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం నగరంలోని లోక్ భవన్ దర్బార్ హాల్‌లో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గౌరవ గవర్నర్ అబ్దుల్ నజీర్ పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా గౌరవ గవర్నర్.. ఏపీ ఎన్‌జీజీవో నేతలను అభినందించారు. గౌరవ హోంమంత్రి వంగలపూడి అనిత, సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వి.వెంకటరెడ్డి తదితరులతో కలిసి జ్ఞాపిక, ప్రశంసా పత్రం అందించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్‌జీజీవో రాష్ట్ర అధ్యక్షులు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ వీర సైనికులు, వారి కుటుంబాలను ఆదుకోవడం బాధ్యతగా గుర్తించి ప్రభుత్వ ఉద్యోగులు ఏటా పతాక నిధికి విరాళాలు ఇచ్చేందుకు ముందుకొస్తున్నారన్నారు. సంఘం పిలుపు మేరకు విశేషంగా స్పంది0చి ముందుకు వచ్చిన ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఎలాంటి విపత్తు సంభవించినా సామాజిక బాధ్యతగా ప్రజలను ఆదుకోవడంలో, భరోసా కల్పించడంలో ఏపీ ఎన్‌జీజీవో ముందుంటోందన్నారు. కోవిడ్ మహమ్మారి, బుడమేరు వరదలు.. ఇలా ప్రతి సందర్భంలోనూ బాధితులకు అండగా నిలుస్తూ ఉద్యోగులు తమవంతు సహకారంతో ముందుకు రావడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రధాన కార్యదర్శి డీవీ రమణ, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిలారు జగదీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ నిరుపేద ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం..

● 319 మంది అంగన్వాడీ కార్యకర్తలకు 5జి సెల్ ఫోన్లు పంపిణీ. ●రాష్ట్ర మంత్రి కొలుసు పార్ధసారథి ...



**ఏలూరు/నూజివీడు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** నూజివీడు క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 319 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ మొబైల్స్ అందజేసి, గ్రామీణ నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాలు ప్రజలు ప్రభుత్వ సేవలు మరింత సులభతరం చెయ్యాలని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్ధసారథి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సేవలు వేగవంతం, పారదర్శకత కోసం స్మార్ట్ టెక్నాలజీని అంగన్వాడీ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిందన్నారు. చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలోనే అంగన్వాడీ సిబ్బంది వేతనాలు పెంపు జరిగిందని చెప్పారు. గతంతో పోలిస్తే అంగన్వాడీ కార్యకర్తలు గౌరవం, ఆర్థిక భద్రత, భరోసా పెరిగిందన్నారు. రాష్ట్రంలో 5 వేల మినీ అంగన్వాడీ కేంద్రాలను ప్రధాన అంగన్వాడీ కేంద్రాల స్థాయికి అప్‌గ్రేడ్ చేసిన కూటమి ప్రభుత్వం మని అన్నారు. దీన్ని వలన పోస్టులు సంఖ్య పెరిగి, అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు, భవనాలు, త్రాగునీరు, మరుగుదొడ్లు మెరుగు పర్చడంపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలపై పని భారం తగ్గించేందుకు యాప్‌ల సంఖ్యను తగ్గించాలనే ప్రతిపాదనతో కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరిందన్నారు. పిల్లలు పోషణ, తల్లుల ఆరోగ్య పర్యవేక్షణ మరింత సమర్థవంతంగా జరిగేందుకు డిజిటల్ వ్యవస్థ తీసుకొచ్చామని అన్నారు. అంగన్వాడీలు ప్రభుత్వానికి కీలక భుజాలని, వారి సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సమర్థతగల ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వీరికి తోడుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సహకారంతో చిన్నబిన్నమైన ఆర్థిక వ్యవస్థను సరిదిద్దు తున్నామన్నారు. అంగన్వాడీ కార్యకర్తలకు ఎటువంటి ఇబ్బంది వచ్చినను మీకు అండగా ఉంటానని, మంచి సేవలు అందించి మంచి ఫలితాలను తీసుకురావాలని ఈ సందర్భంగా కోరారు. టీచర్లు, వర్కర్లకు, అంగన్వాడీ సిబ్బందికి రిటైర్ అనంతరం గ్రాడ్యుయేట్ సుమారు రూ1లక్ష అందజేస్తున్న కూటమి ప్రభుత్వం అన్నారు. మునుపెన్నడూ లేని విదంగా అంగన్వాడీ వర్కర్లు గాని టీచర్లు గాని చనిపోతే మట్టి ఖర్చులు రూ 15 వేలు అందిస్తున్న కూటమి ప్రభుత్వామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అంగన్వాడి టీచర్లు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రైస్తవ సోదరుల అభివృద్ధికి సంక్షేమానికి రూ,150 కోట్లు కేటాయించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం

## క్రీస్తు మార్గం మంచి మార్గం ఏసు మార్గం మానవాళికి దిక్సూచి లాంటిది



**నూజివీడు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యుల క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన సెమీ క్రిస్టమస్ కు ప్రత్యేక అతిథిగా హాజరై భక్తులకు ఫాదర్స్, మరియు పార్టీ నాయకులకు కార్యకర్తలకు క్రిస్టమస్ శుభాకాంక్షలు తెలియజేసిన రాష్ట్ర గృహనిర్మాణ మరియు సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్ధసారధి, మొదటిగా మంత్రి కొలుసు పార్ధసారధి కి ఘనంగా స్వాగతం పలికిన చర్చి ఫాదర్స్ సిస్టర్స్ అనంతరం వాక్యం చదివిన మంత్రివర్యులు ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి భక్తులకు అందజేసిన మంత్రి మరియు స్నేహ రైట్స్ బి, నగేష్ రావు ఆధ్వర్యంలో 30మంది నిరుపేదలకు 17 రకాల నిత్యవసర సరుకులు అందజేసిన మంత్రివర్యులు విద్యార్థులకు క్రిస్టిమస్ శుభాకాంక్షలు అందజేసిన మంత్రి మాట్లాడుతూ మునుపెన్నడూ లేని విధంగా క్రిస్టియన్ సోదరుల అభివృద్ధి సంక్షేమానికి రూ.150 కోట్లు కేటాయించిన ప్రభుత్వం కూటమి ప్రభుత్వం క్రిస్టియన్ సంక్షేమానికి వారి అభివృద్ధికి జెరూసలేము యాత్రకు విదేశీ విద్యను అభ్యసించడానికి ప్రభుత్వం మరిన్ని నిధులు కేటాయించిందని దాన్ని క్రిస్టియన్ సోదరులు సద్వినియోగం చేసుకోవాలని దానికి కావలసిన నా వంతు సహాయ సహకారం అందిస్తామని మంత్రి తెలిపారు. క్రైస్తవులు కుటుంబాలు మంచి ప్రేమ గల వారని గుర్తుచేశారు. దేవుడు దృష్టిలో మానవులంతా సమానం ఎవరికి కావలసిన అవసరాలు వారికి పుట్టించినప్పుడే వారికి సమృద్ధిగా ఇస్తారని తెలిపారు. దేవుడి దయతో మాత్రమే ఈ పదవులు ప్రభుత్వాలు ఏర్పడతాయి అన్నారు. దేవుని మార్గంలో నడుస్తే అందరూ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేసే ప్రభుత్వాన్ని కూడా ఆశీర్వదించాలని ఫాదర్స్ ను, కోరారు. గతంలో 255 క్రైస్తవ మందిరాలకు బడ్జెట్ కేటాయించిన ప్రభుత్వం కూడా మాదే అన్నారు గతంలో క్రిస్టియన్ సోదరులకు అనేక అభివృద్ధి సంక్షేమ ఫలాలు ఇచ్చింది రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు అని తెలిపారు. ప్రభు ఆశీస్సులతో పట్టణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి మంత్రి అన్నారు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని ప్రార్థించానన్నారు , ప్రభు వారి ఆశీస్సులు అందరిపై ఉండాలి. నూజివీడు నియోజకవర్గ ప్రజలు, జిల్లా ,రాష్ట్ర ప్రజలందరికీ సకల శుభాలు కలగాలని, అందరి జీవితాల్లో చీకటి తొలగిపోయి వెలుగులు నింపాలని విజయాలు సిద్ధించాలని ప్రభువును ఆకాంక్షించానన్నారు ప్రభు వారి ఆశీస్సులతో రాష్ట్రంలోని, జిల్లాలోని ప్రతీ కుటుంబం సుఖ సంతోషాలతో అభివృద్ధిలో ముందడుగు వేయాలని అభిలాషించారు. అలాగే రాష్ట్ర సమగ్రాభివృద్ధికి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రజలు సహకరించాలన్నారు .క్రీస్తు వారి ఆశీస్సులతో పాడి పంటలు బాగా పండి రాష్ట్ర ప్రజానీకం సుఖ సంతోషాలతో వర్ధిల్లాలి.ప్రభు వారి ఆశీస్సులతో ప్రజలకు అంతా మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకు లు తెలుగుదేశం కూటమి నాయకులు చర్చి ఫాదర్లు సిస్టర్స్, చర్చి, పెద్దలు ఇళయరాజా, రమేష్, తదితరులు ప్రభు వారి ఆశీస్సులు పొందారు.

# విద్యుత్ షాక్ మృతుని కుటుంబానికి వెంకట్రామ్ పరామర్శ



**కోడూరు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** కోడూరు మండలం పిట్టల్లంక శివారు బడేవారిపాలెంలో జనసేన పార్టీ కార్యకర్త బడే పిచ్చేశ్వరరావు ఇటీవల కరెంట్ షాకుతో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్ శుక్రవారం పరామర్శించారు. పిచ్చేశ్వరరావు ఆకస్మిక మృతికి తన ప్రగాఢ సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. పిచ్చేశ్వరరావు కుమారులు గోపి, నవీన్ లకు ధైర్యం చెప్పారు. అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట జనసేన మండల అధ్యక్షుడు, సొసైటీ చైర్మన్ మర్రె గంగయ్య, టీసీ అధ్యక్షుడు చుండూరు నాగేశ్వరరావు, టీడీపీ నాయకులు, శివాలయం మాజీ చైర్మన్ బడే పిచ్చియ్య, కూటమి నాయకులు పూతబోయిన సీతారత్న సాయిబాబు, తోట రాంబాబు, గాదె భాస్కరరావు, బండ్రెడ్డి హరి, బడే హనుమంతరావు, తోట లక్ష్మణ, తోట రాజేష్, కడవకొల్లు రాజేష్, కుక్కు మల్లి, గోళ్ళ కొండయ్య, మత్తి సుబ్బారావు తదితరులున్నారు.

# వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు బయో ఆధారిత ఆవిష్కరణలు కీలకం : డా. తస్లీమారిఫ్ సయ్యద్

## -యార్లగడ్డ శ్రీరాములు 22వ స్మారక ఉపన్యాసంలో ప్రకృతి ఆధారిత పరిష్కారాలపై లోతైన చర్చ




**విజయవాడ,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సమస్యలకు ప్రకృతి ఆధారిత బయో ఆవిష్కరణలే స్థిరమైన పరిష్కారమని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ ప్లాట్‌ఫామ్స్, బెంగళూరు సంచాలకులు డా. తస్లీమారిఫ్ సయ్యద్ అన్నారు. ఈ ఆవిష్కరణల ద్వారా వ్యవసాయం, పర్యావరణం, ప్రజారోగ్యాన్ని ఏకకాలంలో మెరుగుపరచవచ్చని ఆయన స్పష్టం చేసారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా), ఆంధ్రప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో, మాలక్ష్మి గ్రూప్ సహకారంతో విజయవాడలోని నోవోటెల్ హోటల్‌లో "వాతావరణ మార్పు - పర్యావరణం, ఆరోగ్యం, వ్యవసాయంపై బయో ఆధారిత ఆవిష్కరణల ప్రభావం" అనే అంశంపై శుక్రవారం యార్లగడ్డ శ్రీరాములు 22వ స్మారక ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సంవత్సరం అమరావతి వేదికగా అంతర్జాతీయ స్థాయిలో విశేష ప్రతిభ కలిగిన వారితో సామాజిక బాధ్యతగా మాలక్ష్మి గ్రూప్ ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. ఈ సందర్భంగా డా. తస్లీమారిఫ్ సయ్యద్ మాట్లాడుతూ వాతావరణ మార్పు కారణంగా ఆహార భద్రతే కాక, నీటి వనరులు, మానవ ఆరోగ్యంపై ఇప్పటికే తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేసారు. ఈ పరిస్థితులకు అడ్డుకట్ట వేసేందుకు సమాజం లోతైన సమాలోచన చేయవలసిన అవసరం ఉందన్నారు. మొక్కలు, సూక్ష్మజీవులు, సముద్రపు శైవలాలు, సహజ పదార్థాల ద్వారా రసాయనాల వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడవచ్చని వివరించారు. పంటల దిగుబడిని పెంచే సముద్రపు శైవలాలతో తయారైన బయో ఎరువులు, కాలుష్య భరిత భూమి, నీటిని శుభ్రపరిచే సూక్ష్మజీవ సాంకేతికతలు, తక్కువ ఖర్చుతో వైద్య పరీక్షలు చేసే పరికరాలు వంటి సి-క్యాంప్ మద్దతు ఉన్న ఆవిష్కరణలను గురించి ఆయన వివరించారు. భారతదేశం జీవశాస్త్ర ఆవిష్కరణల్లో ప్రపంచ స్థాయిలో ముందంజలో నిలుస్తోందని, శాస్త్రీయ పరిశోధనలను సమాజానికి ఉపయోగపడే విధంగా మార్చడంలో సి-క్యాంప్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. యువ ఇంజినీర్లు, శాస్త్రవేత్తలు, విద్యార్థులు ప్రకృతితో మమేకమై పనిచేయగలిగిన సాంకేతికతల అభివృద్ధి పట్ల శ్రద్ధ వహించాలని డా. తస్లీమారిఫ్ సయ్యద్ పిలుపునిచ్చారు. మాలక్ష్మి గ్రూప్ వ్యవస్థాపకులు యార్లగడ్డ హరిశ్ చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, సమాజం, పర్యావరణ హితమే నూతన సాంకేతికతల లక్ష్యంగా ఉండాలన్న యార్లగడ్డ శ్రీరాములు ఆశయాలను కొనసాగించడానికే ఈ స్మారక ఉపన్యాసాల పరంపరను ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామన్నారు. యువతలో నైతికతతో కూడిన, స్థిరమైన, సామాజిక బాధ్యత గల ఆవిష్కరణలను ప్రోత్సహించడమే మాలక్ష్మి గ్రూప్ లక్ష్యమని తెలిపారు. తొలుత యార్లగడ్డ శ్రీరాములు చిత్రపటానికి దీపప్రజ్వలన చేసి పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాలక్ష్మి ప్రాజెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ సందీప్ మండవ మాలక్ష్మి గ్రూప్ 20 సంవత్సరాల ప్రయాణాన్ని వివరించారు. శ్రీరాములు జీవితం, ఆయన అందించిన సేవలపై రూపొందించిన లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. శుక్రవారం నాటి మాలక్ష్మి గ్రూప్ 20వ ఫౌండేషన్ డే వేడుకల నేపథ్యంలో అతిథులు, ఆహ్వానితుల సమక్షంలో హరిశ్ చంద్ర ప్రసాద్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) రాష్ట్ర చైర్మన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ దేవకుమార్ ప్రారంభోపన్యాసం చేయగా, డా. బి. పాండురంగరావు, సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్, యార్లగడ్డ శ్రీరాములు సేవలు వివరిసతూ కొనసాగించవలసిన ఆయన వారసత్వాన్ని గుర్తు చేశారు. అనంతరం నిర్వహించిన ప్రశ్నోత్తర కార్యక్రమంలో విద్యార్థులు చురుకుగా పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా%-% వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన షేక్ రహమతున్నీసా (బీటెక్ 9.81 జీపీఏ), ఆంధ్ర లయోలా కళాశాలకు చెందిన గుటాల అపూరూప్ (ఫిజిక్స్‌లో ఐదు సెమిస్టర్లలో 92 శాతం మార్కులు) లకు యార్లగడ్డ శ్రీరాములు మెరిట్ స్కాలర్‌షిప్‌లు అందచేసారు. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజినీర్స్ (ఇండియా) రాష్ట్ర గౌరవ కార్యదర్శి ప్రొఫెసర్ ఎ.వి. నరేష్ బాబు , విజయవాడ నగర మాజీ మేయర్ డాక్టర్ జంధ్యాల శంకర్, కాట్రగడ్డ దత్తు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకం శ్రేయస్కరం-ఎస్ఐ సతీష్ కుమార్

● హెల్మెట్ వాడకంపై అవగాహన ర్యాలీ





**జి.కొండూరు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** హెల్మెట్ వాడకం శ్రేయస్కరమని స్థానిక ఎస్ఐ సతీష్ కుమార్ ద్విచక్ర వాహన దారులకు సూచించారు. జి.కొండూరు మండల వ్యాప్తంగా పోలీస్ సిబ్బంది, పాఠశాలల విద్యార్థులతో మైక్ ప్రచారం ద్వారా హెల్మెట్ వాడకం వల్ల కలిగే ప్రయోజనాలు, హెల్మెట్ వాడకపోవటం వల్ల జరిగే నష్టాలు పై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలని ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చు అని ఎస్ ఐ సతీష్ కుమార్ తెలిపారు. యువత సెల్ ఫోన్ మాట్లాడుతూ అతి వేగంగా వెళ్లడం వంటి కారణాలతో ప్రమాదం సంభవించే అవకాశం ఉందన్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, అలా ఇవ్వడం చట్టరీత్య నేరమన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ఎక్కువ శాతం రోడ్డు ప్రమాదాలు జరుగుతు న్నాయని అన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ ఐ హెచ్చరించారు. హెల్మెట్ ధరించడాన్ని నిర్లక్ష్యం చేయొద్దని ద్విచక్ర వాహనదారులకు సూచించారు.

# రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బల్లెం రోశయ్య- అన్నపూర్ణమ్మ దంపతులకు ఘన సత్కారం

● చీఫ్ ఇంజనీర్ రోశయ్య దంపతులను సన్మానించిన నూతక్కి రాంప్రసాద్-రాజేంద్ర దేవి దంపతులు





రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బల్లెం రోశయ్య

**జి.కొండూరు,డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో పనిచేసిన ప్రముఖ రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ (ఈ ఎన్ సి) బల్లెం రోశయ్య-అన్నపూర్ణమ్మ దంపతులను వారి కుటుంబ ఆత్మీయులు గొల్లపూడి వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నూతక్కి రాంప్రసాద్-రాజేంద్ర దేవి దంపతులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. తమ స్వగ్రామమైన గడ్డమణుగు గ్రామానికి విచ్చేసిన రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బల్లెం రోశయ్య - అన్నపూర్ణమ్మ దంపతులను నూతక్కి రాంప్రసాద్-రాజేంద్ర దేవి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. సాగునీటి ప్రాజెక్ట్ లు, కాలువల నిర్వహణలో బల్లెం రోశయ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కు అందించిన అరుదైన సేవలను రాంప్రసాద్ కొనియాడారు. ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరు మండలంలోని ఓ మారుమూల ఉన్న గడ్డమణుగు గ్రామానికి చెందిన బల్లెం రోశయ్య తమ ప్రాథమిక విద్యను గడ్డమణుగు గ్రామంలోనే పూర్తి చేశారు. అక్కడి నుంచి జి.కొండూరు హైస్కూల్ లో పదో తరగతి పూర్తి చేసుకొని ఇంటర్మీడియట్ విజయవాడ లయోలా లో చదివారు. అనంతరం కాకినాడ రంగరాయి కాలేజీలో ఉన్నత విద్య బిఈ కోర్స్ పూర్తి చేసి డైరెక్ట్ రిక్రూట్మెంట్ ద్వారా ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం పొందారు. ఇంజనీరుగా అంచెలంచెలుగా ఎదుగుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో సలహాలు ఇచ్చే స్థాయికి ఎదిగారు. చీఫ్ ఇంజనీర్ గా విధులు నిర్వహిస్తూ 1996లో ఉద్యోగ విరమణ చేశారు. బల్లెం రోశయ్య సుమారు 65 ఏళ్ల పాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణలో విశేష సేవలు అందించి నేటి తరానికి ఆదర్శంగా నిలిచారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం లో అప్పటి ముఖ్యమంత్రి దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి, ప్రస్తుత ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనూ సాగునీటి ప్రాజెక్టు నిర్వహణలో సలహాదారుగా వ్యవహరిం చారు. ఉద్యోగ విరమణ తర్వాత కూడా ఆయన రైతాంగ సేవలను దృష్టిలో పెట్టుకొని తన సేవలు రాష్ట్రానికి అందించారు. పోలవరం ప్రాజెక్ట్, పోతిరెడ్డిపాడు, బనకచర్ల, పులిచింతల, పట్టిసీమ,వెలుగోడు, తెలుగు గంగ వంటి ముఖ్యమైన ప్రాజెక్ట్ ల నిర్వహణలో ప్రధాన భూమిక పోషించారు. ప్రాజెక్టుల నిర్వహణలో రిటైర్డ్ చీఫ్ ఇంజనీర్ బల్లెం రోశయ్య తన అనుభవాలను పంచుకున్నారు.

# చలమలశెట్టి ఆమరణ దీక్షకు విశేష స్పందన రెండవ రోజుకు చేరిన దీక్ష





**హనుమాన్ జంక్షన్, డిసెంబర్ 19 (వార్తాప్రభ) :** బాపులపాడు మండలం మల్లవల్లి ఏపీఐఐసీ లో భూములు కోల్పోయిన రైతుల కోసం బాపులపాడు గ్రామ పంచాయతీ లో దారుణంగా పెంచిన ఇంటిపన్నుల తగ్గింపు కోసం గన్నవరం నియోజకవర్గ జన సేన పార్టీ సమన్వయ కర్త చలమలశెట్టి రమేష్ బాబు తీసుకున్న ఆమరణ దీక్ష చేపట్టిన నిర?యం సరైందేనని ఆయన అభిమానులు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం నాటికి రెండవరోజుకు చేరుకున్న ఆమరణ నిరాహారదీక్ష కు మద్దతుగా పలువురు మద్దతు తెలియజేస్తున్నారు. అనేక సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలు తీవ్ర మనోవేదన పడుతున్న బాధితులు. ఇచ్చిన మాట నిలబెట్టుకోమని ప్రభుత్వానికి అనేక సార్లు సంవత్సరాలు తరబడి విజ్ఞప్తి చేస్తున్నా కూడా స్పందించక పోయేసరికి చలమలశెట్టి ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నారు. శుక్రవారం అన్ని పార్టీల నాయకులు స్వయంగా వచ్చి తమ తమ మద్దతు ప్రకటించారు. మద్దతు ప్రకటించిన వారిలో ఏ ఐ సి సి సభ్యురాలు సుంకర పద్మశ్రీ మాట్లాడుతూ అపరిష్కృతంగా సంవత్సరాల తరబడి ఉన్న ఈ సమస్యకు స్పందించి చలమలశెట్టి రమేష్ బాబు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్షకు మద్దతు ప్రకటించారు. అలాగే విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు వారి మిత్రబృందం మద్దతు ప్రకటించారు. పెదపాడు మండల వై యస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్ దీక్ష చేస్తున్న రమేష్ బాబు కు పూల దండ వేసి తన మద్దతు ప్రకటించారు. అలాగే స్రవంతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ తన సంఘీభావాన్ని ప్రకటించారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు సభ్యులు నిరాహార దీక్ష శిబిరం వద్దకు వచ్చి మద్దతు ప్రకటించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు వేగిరెడ్డి పాపారావు, వేము లపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమా ప్రసాద్,తదితరులు వచ్చి తమ తమ మద్దతు ప్రకటించారు. హనుమాన్ జంక్షన్ ఎస్ ఐ వెలుగుల సురేష్ దీక్షా శిబిరం వద్దకు వచ్చి అమరణ నిరాహార దీక్ష విరమించుకోవాలని కోరారు. మిత్రులు, స్నేహితులు, లయన్స్ క్లబ్ సభ్యులు, అభిమానుల తో పాటు వీర మహిళలు, కార్యకర్తలు,పవన్ కళ్యాణ్ అభిమాన సంగం నాయకులు వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188